


సాగుచేసి వదిలేసిన ఉల్లిపంట

నష్టాల ఊబి

- అరటి, ఉల్లి కొనేవారు లేరు.. చీనీకి ధర లేదు
- చేతల కష్టం, పెట్టుబడులు వృథా
- దయనీయ స్థితిలో రైతులు



పక్వానికి రావడంతో గెలలోనే చీలిన కాయలు

ఉద్యాన పంటల రైతులు ఎన్నడూ చూడని గడ్డు పరిస్థితి చవిచూస్తున్నారు. ధర ఎంత తక్కువ ఉన్నా వ్యాపారులు కొనేందుకు ముందుకు వచ్చేవారు. కానీ ఈ ఏడాది నెలకొన్న పరిస్థితి ఎన్నడూ చూడలేదని రైతులు అంటున్నారు. ఏదోక ధరకు అమ్మేద్దామంటే అటు అరటిని, ఇటు ఉల్లిని కొనేందుకు వ్యాపారులే రావడం లేదు. ఈ ఏడాది ప్రారంభం నుంచి కూడా చీనీకి చెప్పుకునే స్థాయిలో ధర పలకలేదు. దీంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

పులివెందుల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు, పులివెందుల నియోజకవర్గాలు ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. ముఖ్యంగా అరటి, చీనీ పంటలు విరివిగా సాగుచేస్తుంటారు. ఒక్క పులివెందుల నియోజకవర్గంలోనే దాదాపు 22వేల నుంచి 25వేల ఎకరాల్లో అరటి సాగులో ఉంది. చీనీ పంట విషయానికొస్తే 20వేల నుంచి 22వేల ఎకరాలలో సాగులో ఉంది. ఈ ఏడాది ఉల్లి పంట మైదుకూరు, కమలాపురం, పులివెందుల నియోజకవర్గాల్లోనూ విస్తారంగా సాగైంది. ఎన్నడూ లేనివిధంగా పులివెందుల నియోజకవర్గంలో దాదాపు 2వేల ఎకరాల్లో ఉల్లి సాగైంది. ఈ పంటలన్నీ దిగుబడులు చేతికొచ్చే సమయానికి ధరలు పతనమయ్యాయి.

తోటల్లోనే అరటి

మూడు నాలుగు నెలలుగా అరటి ధర టన్ను రూ.10వేలు కూడా పలకడం లేదు. రోజురోజుకు ధర పడిపోతూ వస్తోంది. ప్రస్తుతం తోటలోనే అరటి గెలలు పక్వానికి వచ్చి మాగిపోతున్నాయి. దీతంఓ గెలలోనే కాయలు చీలిపోతున్నాయి. ఏదొక ధరకు అమ్మేద్దామని రైతులు భావిస్తున్నా వ్యాపారులు తోటలవైపు రావడమే లేదు. లక్షలు ఖర్చుచేసి సాగుచేసిన పంట కళ్లముందే పాడవుతుంటే చూడలేకపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

చీనీ దయనీయం

జూన్ నుంచి నవంబరు చివరి వరకు తోటల్లో చీనీ కాయలు పక్వానికి వస్తాయి. ధరను బట్టి ఆయా రైతు అమ్ముతుంటారు. గతంలో కాయ నాణ్యతను బట్టి జూన్ ప్రారంభం నుంచి టన్ను రూ.20వేల నుంచి రూ.30వేల మధ్యలో ధర పలికేది. ఈ ఏడాది కాయ ఎంత నాణ్యంగా ఉన్న రూ.20వేలకు మించలేదు. అక్టోబరు చివరి నాటికి 80 నుంచి 90శాతం తోటల్లో కాయలు మార్కెట్‌కు తరలించేస్తారు. దీంతో నవంబరులో రూ.40వేలు, రూ.60వేలు ధర పలుకుతూ వచ్చేది. గతంలో ఒక ఏడాది టన్ను చీనీ రూ.98వేలు కూడా పలికింది. కానీ ప్రస్తుతం చీనీ రూ.20వేలు కూడా పలకక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు

కన్నీటి ఉల్లి

ఈ ఏడాది ఉల్లి రైతులకు కన్నీరే మిగిలింది. కొందరు రైతులు సాగుచేసిన పంట వదిలేయలేక ఏదొక ధరకు అమ్మేశారు. మరికొందరు రైతులు మాత్రం పొలం నుంచి ఉల్లిపంటను తొలగించి వాటిని శుద్ధిచేసి మార్కెట్‌కు తరలిస్తే కూలి డబ్బులు కూడా రావడం లేదని పొలాల్లోనే పశువులకు మేతగా వదిలేశారు. ఈ ఏడాది ప్రభుత్వం టన్ను రూ.12వేలతో కొనుగోలు చేస్తామని ప్రకటించింది. కానీ అది ఆచరణకు నోచుకోలేదు. టన్ను రూ.3వేలు, రూ.4వేలు, రూ.5వేలు ఇలా అమ్మడంతో రైతులకు కూలి ఖర్చులు కూడా రాలేదు.

కొనేందుకు వ్యాపారులు రాలేదు



నాలుగు ఎకరాల్లో అరటి సాగుచేశాను. కాయలు పక్వానికి వచ్చినా వ్యాపారులు తోటల వద్దకు రాలేదు. ఏదొక ధరకు అరటి గెలలు అమ్ముదామన్నా వ్యాపారులు రావడం లేదు. నాలుగు ఎకరాలకు రూ.6లక్షలు ఖర్చు చేశాను. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అరటి రైతులకు కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ అయిన ఇవ్వాలి.

- ప్రభాకర్‌రెడ్డి, అరటి రైతు, లింగాల

పెట్టుబడులు కూడా రావు



ఐదు ఎకరాల్లో చీనీ తోట సాగుచేశాను. ఈ ఏడాది చీనీ పంటకు ధరే లేదు. బయటి ప్రాంతాల నుంచి వ్యాపారులు రాకపోవడంతో ధర లేదని భావిస్తున్నాం. పులివెందుల మార్కెట్‌కే తరలించాల్సి వచ్చింది. పంటకు తెగుళ్ల బెడద అధికమైంది. ఈ ఏడాది పెట్టుబడులు కూడా రావు.

- వెంకటేశ్వర్‌రెడ్డి, చీనీ రైతు, లింగాల

ఉల్లి సాగుచేస్తే చిల్లిగవ్వ రాలేదు



మూడు ఎకరాల్లో ఉల్లిపంట సాగుచేశాను. పురుగుమందులు ఎక్కువ పిచికారీ చేయాల్సి వచ్చింది. నూర్పిడి సమయంలో కూలీలకు అధిక డబ్బులు వ్యయం అవుతోంది. అంతా కలిపి రూ.3లక్షలు ఖర్చు అయింది. రూ.3లక్షలు ఖర్చుచేస్తే మూడు రూపాయలు కూడా రాలేదు. పంటను వదిలేశాను.

- పవన్, ఉల్లి రైతు, చాగలేరు, వేముల మండలం

ముమ్మరంగా ఆవాస్ ప్లస్ సర్వే



రాజీవ్‌నగర్ కాలనీలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ రమణయ్య

పీలేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో శనివారం ఆవాస్ ప్లస్ సర్వే ముమ్మరంగా జరిగింది. సర్వే చేసుకునేందుకు రెండు రోజులే మిగిలి ఉండడం, ఆ విషయం ఆంధ్రజ్యోతిలో రావడంతో చాలామంది సచివాలయాలకు పోటెత్తారు. ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనతో సర్వే సంపూర్ణంగా పూర్తి చేసేందుకు హౌసింగ్ డీఈ రమణయ్య, ఎంపీడీవో శివశంకర్ సర్వే సిబ్బందిని పెంచారు. సచివాలయాల్లోని కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు లాగిన్‌లు అందించి సర్వేకు ఆటంకంగా కలుగకుండా చర్యలు చేపట్టారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేను డీఈ రమణయ్య పర్యవేక్షించారు. సర్వేకు ఆదివారం మాత్రమే గడువు ఉండడంతో ఆదివారం కూడా సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని, తమ పరిధిలోని ప్రాంతాలకు వస్తారని, ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని రమణయ్య తెలిపారు. శనివారం సాయంత్రానికి పీలేరు మండలంలో 5 వేల దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం : జేసీ

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలంలో ప్రైవేటు వ్యక్తుల స్వాధీనంలో ఉన్న 18 ఎకరాల 80 సెంట్ల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబేపల్లెలోని 18 ఎకరాల 80 సెంట్ల ప్రభుత్వ భూమి గౌతమ్, శంకర్‌నారాయణ రెడ్డి, శివగంగ, ఉదయ్ కుమార్‌రెడ్డి స్వాధీనంలో అక్రమంగా ఉంచుకున్నారని, వారికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించినా అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకుని తమ ఆధీనంలో అక్రమంగా ఉంచుకున్నారని విచారణలో తేలిందన్నారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేసిన అప్పటి తహసీల్దార్‌పై చర్యలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వ స్థలాలను నిషేధిత జాబితాలో చేర్చామని, ఆ ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలన్నింటినీ ప్రభుత్వపరం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంబేపల్లె తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. 14 సర్వే నెంబర్లలోని 18 ఎకరాల 80 సెంట్లు భూమిని వెబ్‌ల్యాండ్‌లో ప్రభుత్వపరం చేసినట్లు తెలిపారు.

ఎక్కువ ఫీజులు వసూలు చేయొద్దు

- సాంఘిక సంక్షేమ శాఖ డీడీ దామోదర్‌రెడ్డి



విద్యార్థులను ఫీజుల గురించి ఆరా తీస్తున్న డీడీ దామోదర్‌రెడ్డి

మదనపల్లె టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ కన్నా అధికంగా ఫీజులు వసూలు చేయొద్దని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సి.దామోదర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో పలు ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఫీజులు ఎంత వసూలు చేస్తున్నారు.? పరీక్ష ఫీజులు ఎంత వసూలు చేస్తున్నారంటూ ప్రశ్నించి వివరాలు నమోదు చేసుకున్నారు. స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థులు రెన్యువల్ చేసుకోవాలని, ఫస్ట్ ఇయర్ విద్యార్థులు కొత్తగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక నక్కలదిన్నె వద్ద సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని డీడీ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. చలికాలంలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న కార్పెట్స్, బెడ్‌షీట్లు, కిటికీల పరిస్థితి గురించి విచారించారు. టెన్త్ విద్యార్థులకు ట్యూటర్‌లు చెబుతున్న ప్రధాన సబ్జెకుల బోధనలు, వాటి ఫలితాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగేంద్ర రాజు, ఏఎస్‌డబ్ల్యూవో గంగిరెడ్డి, వార్డెన్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

పడిపోయిన టమోటా ధరలు



ములకలచెరువు మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన టమోటాలు

ములకలచెరువు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయి. 22 కేజీల బాక్సు ధర నిన్నటి వరకు రూ.వెయ్యి వరకు పలకగా ములకలచెరువు మార్కెట్‌లో శనివారం కేవలం రూ.350 నుంచి రూ.500 వరకు మాత్రమే పలికాయి. ధరలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ములకలచెరువు మార్కెట్ నుంచి టమోటాలు మహారాష్ట్ర రాష్ట్రం నాసిక్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఎగుమతి అయ్యే రాష్ట్రాల్లో టమోటాల దిగుబడి రావడంతో ఇక్కడి టమోటాలకు డిమాండ్ భారీగా తగ్గిపోయింది. దీంతో టమోటా ధరలు ఒక్కసారిగా తగ్గిపోయాయి.

కోర్టుకు నకిలీ మద్యం కేసు నిందితుడు

- 14 రోజులు రిమాండ్... మదనపల్లె సబ్‌జైలుకు తరలింపు



నిందితుడు జగన్‌మోహన్‌రావును తంబళ్లపల్లె కోర్టుకు తీసుకొచ్చిన ఎక్సైజ్ పోలీసులు

ములకలచెరువు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో మరొక నిందితుడిని ఎక్సైజ్ పోలీసులు శనివారం పీటీ వారెంట్‌పై తంబళ్లపల్లె కోర్టుకు తీసుకొచ్చారు. ఇబ్రహీంపట్నం కేసులో అరెస్టయి నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న అద్దేపల్లి జనార్దన్‌రావు తమ్ముడు జగన్‌మోహన్ రావును పీటీ వారెంట్‌పై తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో జగన్‌మోహన్‌రావును మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. కాగా శుక్రవారం అద్దేపల్లి జనార్దన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రమేష్‌బాబు, అల్లాబక్షులను రిమాండ్‌పై మదనపల్లె సబ్‌జైలుకు తరలించిన విషయం విదితమే. ఈ క్రమంలో శనివారం జనార్ధన్‌రావు తమ్ముడిని కూడా జైలుకు తరలించారు.

గడువు ముగిసినా చేపలెలా పడతారు..!

- అడ్డుకున్న పిడుంవారిపల్లె గ్రామస్థులు



పీటీఎం చెరువులో చేపలు పట్టరాదని అభ్యంతరం తెలుపుతున్న పిడుంవారిపల్లె గ్రామస్థులు

పెద్దతిప్పసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం తిప్పరాయసముద్రం పెద్ద చెరువులో చేపల చెరువు వేలం గడువు ముగిసినా చెరువులో దౌర్జన్యంగా చేపలను పట్టుకుంటున్నారని పోతుపేట పంచాయతీ పిడుంవారిపల్లె ప్రజలు అడ్డుకున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు... బూర్లపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఈ చెరువులో చేపల చెరువుకు 2021లో వేలం నిర్వహించగా బి.కొత్తకోటకు చెందిన వారు రూ.17.10 లక్షలకు దక్కించుకుని చేపలను పట్టుకున్నారు. వేలం గడువు ముగిసి నాలుగు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అజమాయిషీ ప్రదర్శిస్తున్నారని, మేము చేపలు పట్టుకునేందుకు చెరువులోకి వెళితే భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మాపై పోలీసు కేసు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. శనివారం అందరం మూకుమ్మడిగా చెరువు వద్దకు చేరుకుని చేపలు పడుతున్న వారిని అడ్డుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

- జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం



బ్యాటింగ్ చేసి ఉపాధ్యాయ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోధనాభ్యాసాన్ని బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఆయన క్రికెట్ బ్యాటింగ్ చేసి ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు డిసెంబరు 15వ తేదీ వరకు ఉపాధ్యాయులకు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటల వలన ఉపాధ్యాయుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. తద్వారా ఒత్తిడిని జయించి విద్యార్థులకు ఉల్లాసంగా పాఠ్యబోధన చేస్తారన్నారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయినిల త్రోబాల్‌లో విజయలక్ష్మి, సుమిత టీం సభ్యులు డివిజనల్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. సంబేపల్లె మండల పరిధిలోని శెట్టిపల్లి, దేవపట్ల, సంబేపల్లె, మోటకట్ల కాంప్లెక్స్‌ల పరిధి నుంచి పురుష ఉపాధ్యాయులు నాలుగు టీములుగా క్రికెట్ పోటీల్లో పాల్గొనగా కెప్టెన్ ప్రభాకర్‌రెడ్డిగా, వైస్ కెప్టెన్‌గా జియావుల్లా ఉన్న టీం డివిజనల్ స్థాయికి ఎంపికైందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ అమరనాధరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రవీంద్రరాజు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సంబరాలు.. ఆందోళనలు...

- రాజకీయ కలకలం రేపిన మదనపల్లె జిల్లా ప్రకటన
- ఆచితూచి అడుగులేస్తున్న రాజకీయ పార్టీలు



రైల్వేకోడూరులో సమావేశమైన రాజంపేట జిల్లా సాధన జేఏసీ నాయకులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కొత్తగా మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రకటన.. ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో రాజకీయంగా కలకలం రేపుతోంది. ఈ ప్రకటనతో కొందరు సంబరాలు జరుపుకుంటుండగా.. ఇంకొందరు ఆగ్రహంతో ఆందోళనలకు దిగుతున్నారు. అదే సమయంలో ముఖ్య రాజకీయ పార్టీలు సైతం ఈ ప్రకటనపై ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఈ సంబరాల్లో పాల్గొనాలా? ఆందోళనలు చేయాలా? తేల్చుకోలేక.. పరిస్థితులను పరిశీలిస్తున్నాయి. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు.. తమ అధిష్ఠానం కొత్త జిల్లాను ప్రకటించిందని ప్రతిపాదిత మదనపల్లె జిల్లాలోని అన్ని నియోకవర్గాలలో తెలుగుదేశం పార్టీ బహిరంగంగా సంబరాల్లో పాల్గొంటోంది. మదనపల్లె జిల్లా ప్రకటనపై వైసీపీ ఎటూ తేల్చుకోలేక.. ఏమాటా బయటకు చెప్పలేకపోతోంది. అదే సమయంలో అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను చేయాలనే డిమాండ్‌పై తెలుగుదేశం పార్టీ ఎటూ చెప్పలేక మౌనంగా ఉంటోంది. వైసీపీ మాత్రం ఆందోళనలకు మద్దతు ఇస్తోంది.

తేనె తుట్టె కదిపిన మదనపల్లె జిల్లా ప్రకటన

2022లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కొత్తగా 13 జిల్లాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి కడప జిల్లా నుంచి రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలతో కలిపి అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేశారు. అయితే మదనపల్లె, రాయచోటి రాజంపేట ప్రాంతాల ప్రజలు తమ ఊరినే జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు జిల్లా సాధన సమితి పేరుతో మూడు ప్రాంతాల్లోనూ.. నెలల పాటు ఆందోళనలు జరిగాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు మధ్యలో ఉంటూ సౌకర్యంగా ఉంటుందనే కారణంతో రాయచోటిని జిల్లా కేంద్రంగా ప్రకటించారు. దీనిపై అటు మదనపల్లె, ఇటు రాజంపేట వాసులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమ ఊరినే జిల్లా కేంద్రంగా ప్రకటించి ఉంటే.. మాకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని ఆశించారు. ఈ పరిస్థితుల్లో గత ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే.. మదనపల్లెను జిల్లా చేస్తామని ప్రకటించారు. రాజంపేటలోనూ.. ఎన్నికల ప్రచారంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తామన్నారు. రాయచోటి ఎన్నికల ప్రచారంలో రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనలు ప్రజలను తికమక పెట్టాయి. అనుకున్నట్లే.. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. మొదటి సంవత్సరం పాటు.. కొత్త జిల్లాల ప్రతిపాదన తెరమీదకు రాలేదు. తర్వాత అనూహ్యంగా కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ తెరమీదకు వచ్చి.. వేగం అందుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మంత్రులతో నూతన జిల్లాల ఏర్పాటు కోసం ఆరుగురు మంత్రులతో సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సబ్ కమిటీ ప్రతిపాదనల ఆధారంగా రాష్ట్రంలో మూడు కొత్త జిల్లాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారు. దీంతో మదనపల్లె జిల్లా ఏర్పాటు మార్గం సుగమం అయింది. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం మదనపల్లె జిల్లా ఏర్పాటుపై ప్రిలిమినరీ నోటిఫికేషన్ వెలువరించింది. ఈ ప్రకటన తేనెతుట్టెను కదిపినట్లు అయింది.

సంబరాలు..ఆందోళనలు

మదనపల్లె జిల్లా ఏర్పాటు పట్ల ప్రతిపాదిత మదనపల్లె జిల్లాలోని పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకుంటున్నారు. వైసీపీ మాత్రం మౌనంగా ఉంటోంది. అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లె విడిపోయిన తర్వాత రాజంపేటను జిల్లా కేంద్రంగా చేయాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం అక్కడ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు ఆందోళన చేస్తున్నాయి. ప్రస్తుత అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని మార్చకుండా ఉంచినందుకు.. ఇక్కడి ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వైసీపీ మాత్రం మదనపల్లెను విడదీయడం సరైంది కాదని పేర్కొంటోంది. ప్రస్తుత వైఎస్సార్ కడప జిల్లాలో ఉన్న ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను అన్నమయ్య జిల్లాలో కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై ఈ రెండు మండలాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను కడప జిల్లాలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు మౌనంగా ఉన్న రాజకీయ పార్టీలు, ప్రజలు, ప్రజాసంఘాలు తమ ప్రాంతానికి అన్యాయం జరిగింది.. తమ ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా చేయాలంటూ.. రోడ్డెక్కడానికి మదనపల్లె జిల్లా ప్రకటనే కారణమని చెప్పవచ్చు.



మదనపల్లెలో ఎమ్మెల్యే షాజహాన్‌బాష ఆధ్వర్యంలో సంబరాలు (ఫైల్)

మదనపల్లె జిల్లా పేరెత్తని వైసీపీ

- అంశాలపై చర్చ జరగకుండానే అన్నీ 'ఓకే'
- ఆమోదంతో ముగిసిన కౌన్సిల్ సమావేశాలు
- ఆ పదంతోనే 55 అంశాలకూ మోక్షం
- జిల్లా ప్రకటనపై టీడీపీ కౌన్సిలర్ల హర్షం




జిల్లా ప్రకటనపై ధన్యవాదాలు చెబుతున్న కౌన్సిలర్లు, కౌన్సిల్‌లో మేం చెప్పిందే జరుగుతుందంటున్న చైర్‌పర్సన్ మనూజ

మదనపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రకటనపై టీడీపీ కౌన్సిలర్ పచ్చిపాల తులసి, మరో ఇద్దరు టీడీపీ మద్దతుదారులైన కౌన్సిలర్లు మార్పూరి నాగార్జునబాబు, ఎస్.కరీముల్లాలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు, ఆ తర్వాత మాటిచ్చినట్లు హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ పట్టుబట్టి ముందుండి అమలు చేయించిన స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు జిల్లా సాధనకు పోరాటాలు చేసిన ఉద్యమవీరులకు అభినందనలు తెలిపారు. జిల్లా ప్రకటనతో మన కౌన్సిల్, దీనిని సాధించిన ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని ఆ ముగ్గురు కౌన్సిలర్లు ప్రకటించారు. అయితే మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ సహా వైసీపీ కౌన్సిలర్లు ఎవరూ వీరి ప్రకటనకు మద్దతు పలకపోగా, సమావేశం ప్రారంభమై చైర్‌పర్సన్ ప్రసంగం చేయకనే జిల్లా అంశం ఎందుకని లేవనెత్తారని ప్రశ్నించారు.

జిల్లా అయిన సంతోషం కూడా వైసీపీ కౌన్సిలర్లు వ్యక్తం చేయకపోగా, ఆ అంశాన్ని లేవనెత్తి ధన్యవాదాలు తెలిపే క్రమంలో కౌన్సిలర్లు పి.తులసి, నాగార్జునబాబు, ఎస్.కరీముల్లాపైనే ప్రతిగా పరోక్షంగా ఎదురు దాడి చేయడం, రాష్ట్రంలో ప్రభుత్వం ఏదున్నా.. ఇక్కడ పాలకవర్గం చెప్పినట్లే జరుగుతుందని చైర్‌పర్సన్ ప్రకటించడంపై వైసీపీ నైజం మరోసారి బహిర్గతం అయినట్లయింది. ప్రభుత్వాన్ని పొగడటాన్ని, సాధించిన విషయాన్ని చెప్పుకోవడానికి కూడా ఇష్టం లేదని ఆ ముగ్గురు కౌన్సిలర్లు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఉదయం 11:30 గంటలకు మొదలు కావాల్సిన సమావేశం అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. సమావేశం ప్రారంభంలోనే టీడీపీ మద్దతు కౌన్సిలర్లు మదనపల్లె జిల్లా ప్రకటనకు ధన్యవాదాలు తెలిపే అంశాన్ని లేవనెత్తడంతో చైర్‌పర్సన్‌కు విలువ ఇవ్వకుండా ముందుగానే ఆ అంశాన్ని ప్రస్తావించడం ఏంటని వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. తర్వాత అజెండాలోని అంశాలపై చర్చ ప్రారంభం కాగానే, ఆ అంశాన్ని వాయిదా వేయండని వైసీపీ కౌన్సిలర్లు చెప్పడాన్ని స్వపక్షంలోనే విపక్ష కౌన్సిలర్ షేక్ కరీముల్లా అందుకు ప్రతిగా అడ్డుతగిలారు. అజెండాలోని అంశాన్ని చదవకనే, దానిపై చర్చ జరగకుండానే వాయిదా వేయండని ఎలా చెబుతారని, కౌన్సిల్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా? అంటూ ఎదురుదాడికి దిగడంతో ఇరువర్గాల మధ్య వివాదానికి తెరలేసింది. వీటిపై చర్చ జరగాల్సిన అవసరం లేదన్నట్లు మున్సిపల్ వైఎస్ ఛైర్మన్ జింకా వెంకటాచలపతి అన్ని అంశాలూ ఆమోదం అంటూ ప్రకటించారు. దీంతో మిగిలిన కౌన్సిలర్లు కూడా మద్దతుగా సమావేశం నుంచి బయటకు వెళ్లే ప్రయత్నం చేశారు.

అంతలో మరో కౌన్సిలర్ బి.ఎ.ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ ఇక్కడి కౌన్సిల్‌లో టీడీపీ కౌన్సిలర్ ఉన్నది ఒకరేనని, మిగిలిన ఇద్దరు వైసీపీ నుంచి గెలిచి టీడీపీకి మద్దతుగా నిలవడాన్ని తప్పుపట్టారు. ముగ్గురు చెప్పే అంశాలను మేం ఎలా ఒప్పుకుంటామని మెజారిటీ మేమే ఉన్నామనే ధోరణి ప్రదర్శించడంతో కౌన్సిల్‌లో కొంతసేపు గందరగోళం నెలకొంది. దీంతో ఆ ముగ్గురు కౌన్సిలర్లు సమావేశం నుంచి బయటకు వచ్చేయగా, వైసీపీ కౌన్సిలర్ ప్రసాద్‌బాబు అజెండాలోని రెండు అంశాలను వాయిదా వేయాలని కోరారు. అప్పటికే అన్ని అంశాలు ఆమోదించేశామని, సమావేశం ముగిసిందని వైసీపీ కౌన్సిలర్లంతా బయటకు వచ్చేశారు. ఆ అంశాలను అవసరాన్ని బట్టి తానే ర్యాటిఫై చేశారని చైర్‌పర్సన్ చెప్పడంతో కౌన్సిలర్ ప్రసాద్‌బాబు కూడా అంగీకరించినట్లయింది. రెండు సమావేశాలు చేపట్టి, వాటిపై చర్చ జరగకుండానే కేవలం అయిదు నిమిషాల్లో ఆమోదం, అంతా అయిపోయిందని, ఎలా ప్రకటిస్తారని స్వపక్షంలోనే విపక్ష కౌన్సిలర్ కరీముల్లా వాపోయారు. ఇలా ఇంకా ఎన్నాళ్లు? ఇలా చేస్తారు.? ఇదేనా? ప్రజాస్వామ్యం అంటూ నిలదీశారు. మెజారిటీ మీదే ఉందని, ఇంతకాలం ఇలానే చేశారు? అభివృద్ధే లేకుండా చేశారని, ఇక వార్డుల్లోకి పోతే జనాలే చెబుతారంటూ నిట్టూరుస్తూ బయటకు వచ్చేశారు.

అనంతరం చర్చ లేకుండా ఆమోదించిన అంశాలను పరిగణలోకి తీసుకోవద్దని, ఆ అంశాలను రీషెడ్యూల్ చేయాలని, లేకుంటే న్యాయపరంగా ముందుకెళ్తానని కరీముల్లా, మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు సూచించారు. ఇదిలా ఉండగా, స్వపక్షంలోనే విపక్షంగా ఏడాది కాలంగా అభ్యంతరాలు, ఆటంకాలతో కొన్ని వాయిదా పడుతూ, మరి కొన్ని రద్దయిన వాటితో కలిపి సాధారణ, అత్యవసర అజెండాల్లోని 55 అంశాలూ 'ఆమోదం అనే పదంతో పూర్తయ్యాయి. దీంతో అటు మున్సిపల్ అధికారులు, అటు కాంట్రాక్టర్లు ఊపిరి పీల్చుకున్నట్లయింది.

మదనపల్లెలో తగ్గిన ఉష్ణోగ్రత

పగలు 22... రాత్రి 16 డిగ్రీలు



సాయంత్రం 4 గంటలకే తట్టివారిపల్లె చెరువు వద్ద కురుస్తున్న మంచు

మదనపల్లె టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసలే చలికాలం..అందులోనూ దిత్వా తుపాను ముంచుకొస్తున్న తరుణంలో మదనపల్లె ప్రాంతంలో ఉష్ణోగ్రతలు హఠాత్తుగా పడిపోయాయి. సాధారణంగా మదనపల్లెలో పగలు 30 డిగ్రీల సెల్సియస్, రాత్రిళ్లు 24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు కనిపించడం పరిపాటి. కాగా రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గిపోతుండగా, శనివారం దిత్వా తుపాను కారణంగా మదనపల్లెలో చల్లనిగాలులతో, పగలే మంచుకురుస్తూ వాతావరణం చల్లగా మారిపోయింది. ఆరోగ్యవరంలోని ఉష్ణోగ్రత పరీక్ష కేంద్రంలో నమోదైన వివరాలు మేరకు.. శుక్రవారం రాత్రి 16 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, శనివారం పగటి ఉష్ణోగ్రత 24 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. దీంతో ప్రజలు పగలే స్వెట ర్లు, మంచు ధాటికి గొడుగులు పెట్టుకుని నడవడం కనిపించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువు వాసులు అశోక్, ఇబ్రహీంలు పని నిమిత్తం ద్విచక్రవాహనంలో బస్టాండుకు బయలుదేరారు. ఈ క్రమంలో స్థానిక రైల్వేగేటు సమీపంలో ద్విచక్రవాహనం, బొలేరోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడడంతో చికిత్సల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు

రామసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బాలిక అదృశ్యం కేసులో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. ఇది పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే సున్నితమైన కేసని, దర్యాప్తునకు ఆటంకం కలిగించినా, తప్పుడు ప్రచారం చేసినా కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి శనివారం ఎస్‌ఐ మీడియాకు వివరిస్తూ 17 ఏళ్ల బాలిక తప్పిపోయింది. నవంబరు 17న తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో గాలింపు ప్రారంభించాము. అయితే, సంఘటన జరిగిన వెంటనే అనుమానిత వ్యక్తి తల్లిదండ్రులు, సోదరుడు పరారీ అయ్యారు. వారు నివాసం మార్చడం, సమాచారం దాచడం వంటి చర్యలతో దర్యాప్తునకు తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు. విచారణకు హాజరు కావాలని ఆదేశించినా ఇప్పటివరకు వారు సహకరించలేదని తెలిపారు. బాలిక మిస్సింగ్ కేసును కొందరు పెద్దలు ప్రేమజంట వ్యవహారంగా చూపించడానికి చెప్పడం చట్టపరంగా నైతికంగా తప్పని ఆయన స్పష్టం చేశారు. తప్పుడు కథనాలు, వ్యాఖ్యలు చేసేవారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.


క్రీడల్లో సత్తా చాటిన పీలేరు విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పీలేరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన విభిన్న ప్రతిభావంతుల స్పోర్ట్స్‌లో పీలేరు విద్యార్థులు సత్తాచాటారు. జిల్లా పారా ఒలింపిక్స్ అసోసియేషన్ క్రీడలలో పీలేరు జిల్లా పరిషత్ మెయిన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పోటీలలో ప్రతిభ కనపర్చి బహుమతులు కైవసం చేసుకున్నట్లు హెచ్‌ఎం డాక్టర్ నీలం జయపాల్‌రెడ్డి తెలిపారు. రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు రన్నింగ్ రేస్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించారని చెప్పారు. ఇందులో తమ పాఠశాల విద్యార్థులు ఆయిషా వంద మీటర్ల రన్నింగ్ రేస్, జ్ఞానశేఖర్ షాట్‌పుట్‌లో, లిఖిత్ లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు డీఈవో చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేసినట్లు ఆయన చెప్పారు. విభిన్న ప్రతిభా వంతుల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు లలితకుమారి, ప్యారూఖాన్, శ్రీరాములు, జయరామ్‌నాయక్, భాస్కర్, హేమలత అభినందించారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు అరవింద్



అరవింద్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

వాల్మీకిపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు వాల్మీకిపురం క్రీడాకారుడు ఎంపికయ్యాడు. స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న టి.అరవింద్ ఈనెల 26వ తేదీ నుంచి విజయవాడలో జరిగిన అంతర్ జిల్లాల అండర్-19 బాస్కెట్ బాల్ పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహించి విశేష ప్రతిభ కనబరచి సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. అతడి ప్రతిభను గుర్తించిన సెలెక్టర్లు జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ కిరణ్‌కుమార్ తెలియజేశారు. త్వరలో రాజస్థాన్‌లో జరగనున్న అండర్-19 జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలలో అరవింద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి క్రీడాకారుడు అరవింద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భాస్కర్‌నాయుడు, బాస్కెట్‌బాల్ కోచ్ అంజి, అధ్యాపకులు, సీనియర్ క్రీడాకారులు అరవింద్‌ను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



వెంకటేశ్ మృతదేహం

రామాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నటు ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ బీసీ కాలనీకి చెందిన రౌతు వెంకటేశ్ (39), కళావతి దంపతులకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తె సంతానం. ఇటీవల కళావతి ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లింది. అయితే, అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రామాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

కలికిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పరిశ్రమలు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకారాలందించి ప్రోత్సహిస్తామని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి హామీ ఇచ్చారు. శనివారం ఆయన కలికిరి శివార్లలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూములను పరిశీలించారు. ఈ పారిశ్రామికవాడలో స్థాపించిన ఎస్‌ఆర్‌కే ఫుడ్స్, చేగు ఫుడ్స్ యూనిట్లను పరిశీలించారు.

ఎస్‌ఆర్‌కే ఫుడ్స్‌లో ఏళ్లు గడుస్తున్నా ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌ఆర్‌కే ఫుడ్స్‌లో వివిధ రకాల ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించేందుకు ముందుకొస్తే ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహకారం అందజేస్తామని చెప్పారు. అన్ని రకాల అనుమతులను సింగిల్‌విండో పద్ధతిలో త్వరితగతిన మంజూరు చేస్తామని కూడా చిరంజీవి చౌదరి చెప్పారు. అదేవిధంగా కొత్తగా ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలను అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణకిశోర్, ఇతర ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టులో కడప క్రీడాకారిణి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే నెట్ బాల్ క్రీడల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడే అండర్-14 బాలురు, బాలికల జట్టును శనివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో పరిశీలకులు కల్పన, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు సునీత, మల్లేశ్వరరావు, పీడీలు చిట్టిబాబు, ఖుద్దూస్, విజయలక్ష్మి తదితర పీడీలు ఎంపిక చేశారు.

బాలికల జట్టు: బి.భాగ్యశ్రీ (విశాఖపట్నం), ఎస్.వెంకట నాగ భవానీ ఈక్షిత (విశాఖపట్నం), పల్లి శ్రీగాయత్రి (విశాఖపట్నం), పెచ్చెట్టి బిందుశ్రీ మంజు (పశ్చిమ గోదావరి జిల్లా), పి.వసుంధర (పశ్చిమ గోదావరి), యండమూరి హన్నా (కృష్ణా), సీహెచ్ విద్యాలక్ష్మి (తూర్పు గోదావరి), ఎం.ప్రణీత (కడప), ఎంకే కీర్తిక (చిత్తూరు), ఎం.అమూల్య (గుంటూరు), డి.మెహరీన్ (నెల్లూరు), జి.తేజశ్రీ (పశ్చిమ గోదావరి జిల్లా).

బాలుర జట్టు: కె.సోహిల్ (విశాఖపట్నం), ఎం.ధనుష్ మణికంఠ (విశాఖపట్నం), పి.చందు వెంకట నిఖిల్ (విశాఖపట్నం), ఎం.వెంకట శ్రీనివాస్ కుమార్ (తూర్పు గోదావరి), కె.స్సజన్ (తూర్పు గోదావరి), కె.ఆంటోని (పశ్చిమ గోదావరి), బి.లోకేష్ (కృష్ణా), వి.డిల్లీబాబు (నెల్లూరు), కెవి బాలు (గుంటూరు), ఆర్.అజయ్‌కుమార్ (విజయనగరం), టీజే శేషాద్రి (చిత్తూరు), వి.గౌతమ్‌బుద్ధ (పశ్చిమ గోదావరి జిల్లా).

రాజంపేటను జిల్లా కేంద్రం చేయండి

- రైల్వేకోడూరులో కీలక సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ, జనసేన ఇతర పార్టీల నేతలు




కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజంపేట, కోడూరు జేఏసీ నాయకులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజంపేట నేతలు

రాజంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లె జిల్లాను ప్రకటించి యదావిధిగా రాయచోటి జిల్లా కేంద్రం కొనసాగింపుపై రాజంపేట, కోడూరులలో ఉద్యమం తీవ్రతరమవుతోంది. ఇందులో భాగంగా శనివారం రైల్వేకోడూరులో అన్ని రాజకీయ పక్షాలు సమావేశమై రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని తీర్మానించారు. ఈ మేరకు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు విజ్ఞాపనపత్రాన్ని అందజేశారు. శనివారం కడప జిల్లా గండికోటలో జరిగిన బీజేపీ సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ బీజేపీ రాజంపేట నేతలు సురేష్‌రాజు, రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అలాగే రైల్వేకోడూరులో అన్ని రాజకీయ పక్షాలు సమావేశమై రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని రెండు నియోజకవర్గాల్లోని అన్ని రాజకీయ పక్షాలు ఏకకంఠంతో విజ్ఞప్తి చేశాయి. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కీలక సమావేశానికి ఎమ్మెల్యే శ్రీధర్‌తో పాటు రాజంపేట, కోడూరు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, జనసేన, ఇతర రాజకీయ పక్షాల నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా తమ నియోజకవర్గవాసులు అంగీకరించబోమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి అందరికీ ఆమోదయోగ్యమైన ప్రజల అభీష్టాన్ని వివరించి నిన దించి తమకు జిల్లా విషయంలో న్యాయం చేయాలని కోడూరు, రాజంపేట వాసులు కోరారు. కార్యక్రమంలో కోడూరు నాయకులతో పాటు రాజంపేట జేఏసీ నేతలు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి రమణ, వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు ఎమ్మెల్యేకు విజ్ఞాపన పత్రం అందజేశారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని, జిల్లా కేంద్రం చేస్తే తమ మండలాలను అన్నమయ్య జిల్లాలో ఉంచాలని లేదంటే రాయచోటిని జిల్లా కేంద్రం కొనసాగిస్తే ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడపలోనే ఉంచాలని ఆయా మండలాల వాసులు కడప జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు.

గురువుల క్రీడోత్సాహం..



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రెడ్డిభాష

పీలేరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గురువుల క్రీడోత్సవంతో కేవీపల్లె మండలం గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. శనివారం కేవీపల్లె మండలంలోని ఉపాధ్యాయులకు గ్యారంపల్లె గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో క్రీడలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో రెడ్డిబాష మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని చెప్పారు. నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. పురుషులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు.



త్రోబాల్ ఆడుతున్న మహిళా ఉపాధ్యాయులు

క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 15 మందిని, త్రోబాల్ నుంచి 12 మందిని డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. డిసెంబరు 13వ తేదీ డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో వీరు కేవీ పల్లె మండలం తరఫున పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడా పోటీలలో కేవీ పల్లె ఎంఈవో-2 సుబ్రమణ్యంరెడ్డి, ఏపీఆర్ఎస్ గ్యారంపల్లె గురుకుల ప్రిన్సిపాల్ నూర్ అహ్మద్, కేవీపల్లె, జీ కొత్తపల్లె హైస్కూల్ హెచ్‌ఎంలు వై.వీ.రమణ, సరస్వతి, మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి బొట్టు వృథా కానివ్వొద్దు : కలెక్టర్



రామరాజువంకను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రామాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పడే ప్రతి నీటి బొట్టును వృథా కానివ్వకుండా సప్లయ్ చానల్స్ ద్వారా చెరువులు నింపే ప్రక్రియను పూర్తి చేయాలని నీటి పారుదల, వెలిగల్లు ప్రాజెక్టు అధికారులకు కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. శనివారం రామాపురం మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లి గ్రామ పరిధిలోని రామరాజువంక నుంచి బిల్లిగుట్ట చెరువు సప్లయ్ చానల్ పనులను, రామరాజు వంక చెక్‌డ్యాం నిర్మాణానికి సంబంధించిన పనులను, రామరాజు వంక నుంచి ఓబుల్‌రెడ్డి చెరువు, కసిరెడ్డి చెరువుకు, దిగువ చింతలవారికుంట, చింతకుంట నింపు సప్లయ్ చానల్ పనులను కలెక్టర్ పరిశీలించారు. వర్షాకాలంలో నీటిని వృథాగా పోనివ్వకుండా చెరువులు అన్నీ నింపే ప్రక్రియ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సప్లై ఛానల్ ద్వారా చెరువులకు నీటిని నింపడం వలన బల్లగుట్టపల్లి చెరువు ద్వారా 225 ఎకరాలకు, కసిరెడ్డి చెరువు, ఓబుల్‌రెడ్డిచెరువు ద్వారా దాదాపు 109 ఎకరాలకు నీరు అందిస్తామన్నారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో ప్రతి చెరువు నీరు నింపే విధంగా సప్లయ్ చానల్ పనులు రేపట్టే విధంగా ప్రణాళికలు తయారు చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఈనెల 30వ తేదీ పదవీ విరమణ చెందుతున్న నీటి పారుదలశాఖ ఎస్ఈ వెంకట్రామయ్యకు కలెక్టర్ పూల మొక్కను అందించి సన్మానించారు. కార్యక్రమంలో నీటి పారుదలశాఖ ఎస్‌ఐ వెంకట్రామయ్య, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు శివారెడ్డి, పట్టాభిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశులు, ఎంపీడీవో జాషువా, ఏవో నాగమణి, హౌసింగ్ ఏఈ ఎల్‌ఎం ప్రసాద్, వీఆర్‌వో ఈశ్వరయ్య, వీఆర్‌ఏ వెంకట్రమణ, నాగలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీతో అభివృద్ధి శూన్యం : మంత్రి

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు సమయంలో శాస్త్రీయంగా చేసి ఉంటే ఈ రోజు మదనపల్లె జిల్లా ఏర్పాటు అయ్యేది కాదన్నారు. జిల్లా కేంద్రం తరలిపోతోందని విష ప్రచారం చేశారని, జిల్లా కేంద్రం మార్పు లేకపోవడంతో ఇప్పుడు వారికి మింగుడుపడడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలను గందరగోళపరిచే తప్పుడు ప్రచారం చేయడం వైసీపీ నేతలు ఇప్పటికైనా మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.


దుగ్గనపల్లెలోని జీవ వనరుల ఉత్పత్తి కేంద్రం

ఉద్యానం... ప్రోత్సాహం

- ప్రకృతి విధానంలో పంటల సాగు ఆరోగ్యకరం
- రైతులకు అండగా ప్రభుత్వం
- ఉద్యాన, వ్యవసాయాధికారుల తోడ్పాటు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలు సాధారణ పంటలతో పోలిస్తే ఎంతో లాభదాయకమైనవి. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి సాగుబడి ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతోంది. మరో వైపు నర్సరీల ఏర్పాటు, సబ్సిడీలు, మైక్రో ఇరిగేషన్ పథకాలు, కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు సహకారం వంటి చర్యలతో ఉద్యానవనశాఖ రైతులకు అండగా నిలుస్తోంది. జిల్లా ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన వన పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

రైతన్నా.. మీకోసం..

రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు జిల్లాలోని రైతుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 24 నుంచి 29 వరకు ప్రతి రైతు ఇంటికి ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు వెళ్లి పంచసూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై వివరిస్తున్నారు. డిసెంబరు 3న రైతు సేవాకేంద్రాల పరిధిలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అన్నిరకాల పంటలకు అనుకూలమైన వాతావరణం కలిగిన వైఎస్ఆర్ కడప జిల్లాలో 45,214 హెక్టార్లలో వివిధ రకాల వ్యవసాయ పంటలు, 58,382 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఇందులో 25,152 హెక్టార్లలో కూరగాయలు, 8717 హెక్టార్లలో మిరప, 2404 హెక్టార్లలో వివిధ రకాల పూలతోటలు సాగులో ఉన్నాయి. 38355 మంది రైతులు 46718 ఎకరాల్లో ప్రకృతి సాగు పద్ధతులను అవలంబిస్తూ ఆరోగ్యకరమైన కాలుష్య రహిత దిగుబడులు పొందుతున్నారు.

ప్రకృతి సాగులో ఉద్యానపంటలకు ఆదరణ

ప్రకృతి సాగులో ఉద్యాన పంటలకు ఆదరణ కనిపిస్తోంది. పూల తోటల్లో చేమంతి, గులాబీ, లిల్లి, కనకాంబరం, బంతిపూలను విస్తృతంగా సాగు చేస్తున్నారు. పండ్లతోటల పరంగా చూస్తే వేలాది ఎకరాల్లో మామిడి, అరటి, చీనీ, బొప్పాయి, సపోటి వంటి పంటలు కూడా విస్తృతంగా సాగు చేస్తున్నారు. అదే విధంగా వేలాది ఎకరాల్లో ఉల్లి, మిర్చి, ధనియాలు, పసుపు తదితర మసాలా పంటలు విస్తృ తంగా సాగులో ఉన్నాయి. బహుళ పంటలు సాగులోకి తెచ్చి తక్కు వ ఖర్చుతో రసాయనాలు లేని సహజ విధానాల్లో సాగు చేయ డం వంటి అంశాలతో రైతుల్లో విస్తృతంగా అవగాహన పెంపొందిం చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీంతో రైతులు వ్యవ సాయంలో వ్యయాన్ని తగ్గిస్తూ తలసరి ఆదాయం అందుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఉద్యానపంటల్లో అంతర పంటలు

ఉద్యానపంటల్లో అంతరపంటలు సాగు చేసే పద్ధతులను అధికారులు రైతులకు వివరిస్తున్నారు. తోటల సాగు అంటే కేవలం మామిడి, జీడీ, కొబ్బరి మాత్రమే కాకుండా జామ, సీతాఫలం, నిమ్మ, నేరేడు, రేగు, మునగ, గులాబీ, మల్లెపూల సాగుతో పాటు ఆయుర్వేద సుగంధ తైల మొక్కల సాగు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఈ పంటలు తక్కువ నీటితో పెరిగే సామర్థ్యం కలిగి బీడు భూములకు ఎంతో అనువుగా ఉంటాయి. పదే పదే నాట్లు వేసుకునే అవసరం లేకుండా సుదీర్ఘకాలం వరకు ఆదాయం వస్తుంది. వార్షిక పంటలు వేశాక ఆదాయం రావడానికి రైతుకు సమయం పడుతుంది. దీని నుంచి బయట పడేందుకు కూరగాయలు, బొప్పాయి, అరటితో పాటు పసుపు, అల్లం వంటి అంతర పంటలను పండిస్తే అదనపు ఆదాయం పొంద అవకాశాలు ఉన్నాయి. ఉద్యానవనశాఖాధికారులు స్టాళ్ల ద్వారా రైతులకు సంబంధిత పంటల సాగు, వాటికి ఉపయోగించే మందులు, సేంద్రియ ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు. ఉద్యానవన పంటల సాగుతో పాటు మార్కెట్ డిమాండ్, రకాలు, పెట్టుబడి, లాభం అంశాలు కూడా చర్చించి పలు సూచనలు సలహాలు ఇస్తున్నారు.


వేముల మండలంలో పంటలు పరిశీలిస్తున్న అధికారులు



ఆరోగ్యకర దిగుబడులు సాధిస్తున్నా..

మాకున్న మూడు ఎకరాలతో పాటు మా అమ్మగారి రెండు ఎకరాలు కలిపి ఐదు ఎకరాల్లో సహజ పద్ధతిలో పలురకాల ఉద్యాన వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నా. వాటికి తోడుగా అంతర పంటలుగా మొత్తం 15 రకాల కూరగాయల సాగు చేస్తున్నా. రసాయనాలు వాడకుండా ఆరోగ్యకర పంట దిగుబడులు అందుకుంటున్నా. ప్రకృతి వ్యవసాయ విభాగంలో ఐసీఆర్‌పీగా పనిచేస్తూ గ్రామంలోని మరికొంత మంది రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నా. ఇటీవల ఇతర దేశాల బృందాలు మా గ్రామానికి వచ్చి మా పంటలు పరిశీలించారు.

-మూలి లక్ష్మీదేవి, మహిళా రైతు, దుగ్గనపల్లె, వేముల మండలం

కేసీ కెనాల్ కింద రెండో పంట సాగు వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ గురివిరెడ్డి

చాపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు కేసీకెనాల్, చాపాడు చానెల్ కింద రెండవ పంట ఇప్పుడే సాగు చేయవద్దని కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి చెప్పారు. శనివారం చాపాడులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీటి విడుదలవిషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి తీసుకుపోతున్నట్లు చెప్పారు. డిసెంబరు 10వ తేదీలోపు నంద్యాలలో అధికారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నీటిని విడుదల చేసేందుకు స్పష్టమైన ప్రకటనకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో మైదుకూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఏపీ రవీంద్ర, ఎపీఎస్ఐడీసీ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి, అల్లాడుపల్లె రైతు సేవా సహకార సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ సీఎం రమేష్‌ను పరామర్శించిన మంత్రి


ఎంపీ సీఎం రమేష్, సీఎం రాజేష్‌తో మంత్రి సత్యకుమార్

ఎర్రగుంట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్, ఆర్ఎస్ఎస్ నాయకులు పరామర్శించారు. శనివారం ఉదయం వారు పోట్లదుర్తిలో ఎంపీ సీఎం రమేష్ తల్లి రత్నమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం రమేష్, సోదరులు సీఎం రాజేష్, సీఎం సురేష్‌లను కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబ విలువలు తెలిసిన ఓ గొప్ప ఇల్లాలు మృతి చెందడం బాధాకరమన్నారు.

ఆన్‌లైన్ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ

పులివెందుల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్-మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎమ్ఎమ్ఎస్) పరీక్ష సిద్ధతకు కీలకంగా భావించిన ఆన్‌లైన్ ప్రశ్నాపత్రాన్ని శనివారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఫిజికల్ సైన్స్ ఫోరం సంయుక్తంగా తయారు చేసిన ఈ ప్రశ్నాపత్రం 30వ తేదీ ఉదయం 10గంటల నుంచి విద్యార్థులకు, ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నట్లు పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నాపత్రాన్ని సాంకేతికంగా ఆన్‌లైన్‌లో పొందుపరచ డంలో చేసిన విశేష కృషిని ఎమ్మెల్సీ అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

కలసపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లె రైతు సేవా కేంద్రం వద్ద ప్రభుత్వం నిర్వహిం చిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుంట్ల జయప్రకాష్ నారాయణ బాబు అకస్మిక తనిఖీ చేశారు. డీసీఎంఎస్, ఆర్ఎస్‌కే బీఏలతో మాట్లాడి రైతుల వద్ద ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని సూచనలు ఇచ్చారు.

హైవే సిబ్బందిపై ఆగ్రహం

చెన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ స్థలంలో ఇటీవల కొంత మంది వ్యక్తులు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. అయితే గత పదిరోజులుగా ఆ నిర్మాణాలన్నింటినీ ఎక్స్‌కవేటరుతో తొలగిస్తున్నారు. కానీ ఇదే ప్రాంతంలో కొందరికి గతంలో విస్తరణకు స్థలం పోను కొంత మిగిలింది. కానీ గత రెండు మూడు రోజులుగా ఆ స్థానంలో ఉన్న నిర్మాణాలను తొలగించేందుకు యత్నించడంతో వాటి యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం చెన్నూరు కొత్తరోడ్డు నుంచి జాతీయ రహదారిలో ఆ స్థలం యజమానులు నాగరాజు, బసిరెడ్డిలు హైవే సిబ్బంది తీరుపై మండిపడుతున్నారు.

చోరీ కేసులో ఒరిస్సా దొంగ అరెస్ట్

- రూ.8.60 లక్షల విలువచేసే బంగారు, వెండి నగలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ లింగప్ప

బద్వేలుటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బంగారు నగల దుకాణంలో ఇటీవల చోరీకి పాల్పడిన ఓ దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 72 గ్రాముల బంగారం, 5 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి శనివారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బద్వేలు పట్టణం సిద్దవటం రోడ్డు మసీదు కాంప్లెక్స్‌లోని జేసీ జ్యువెలర్స్‌లో ఆగస్టు 9వ తేదీ ఒరిస్సాకు చెందిన శ్రీరామ్, అతని స్నేహితుడు వినోద్, బిన్నులు కలసి దొంగతనం చేసినట్లు వివరించారు. ఈ చోరీ కేసును సీఐ లింగప్ప ఆధ్వర్యంలో ఎస్ఐ సత్యనారాయణ, స్పెషల్‌పార్టీ, క్రైంపార్టీ సంయుక్తంగా విచారణ చేపట్టారని తెలిపారు. శనివారం నెల్లూరురోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టి, ఆటోలో అనుమానాస్పదంగా వెళుతున్న శ్రీరామ్ అనే నిందితుని అదుపులోకి తీసుకున్నారు. మిగతా ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. చోరీ కేసును చేధించిన సీఐ లింగప్ప, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాంపురంలో నూర్‌బాష (34) అనే వ్యక్తి మద్యానికి బానిసై ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. నూర్ బాషకు 9 సంవత్సరాల క్రితం వివాహమైంది. నాలుగేళ్ల క్రితం తన భార్య ఇద్దరు పిల్లలను తీసుకొని నూర్ బాషనుంచి విడిపోయింది. అప్పటి నుంచి నూర్ బాష మద్యానికి బానిసయ్యాడు. తల్లి ఖాదర్‌బీతో కలిసి ఉండేవాడు. తల్లి శుక్రవారం గుంతకల్‌కు వెళ్లింది. శుక్రవారం ఫోన్ చేస్తే నూర్ బాష ఫోన్ ఎత్తలేదు. దీంతో పక్కింటి వారికి ఫోన్ చేసి చెప్పడంతో వారు ఇంట్లోకి వెళ్లి చూడగా.. అప్పటికే నూర్‌బాష ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతిచెందాడు. ఈ విషయం తల్లికి సమాచారం ఇచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

మహిళపై అసభ్యకర ప్రవర్తన.. కేసు నమోదు

బద్వేలుటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని సి.బోయినపల్లెలో శుక్రవారం రాత్రి కె.వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి తాగిన మత్తులో ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తీవ్ర మనస్థాపానికి గురై శనివారం బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వెంకటసుబ్బయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

కత్తితో దాడి- ఇద్దరికి గాయాలు

కొండాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపురం గ్రామంలో కత్తితో దాడి చేసిన సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... దత్తాపురం ఎస్సీ కాలనీలో వివాహానికి సంబంధిన మెరవణిలో డీజే జరుగుతుండగా రవి, వీరాంజనేయులు అనే ఇద్దరు వ్యక్తులు ఆంజనేయులు, లక్ష్మినారాయణపై కత్తితో దాడి చేశారు. దీంతో గాయపడిన వారిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించి, లక్ష్మినారాయణ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ శివనాగిరెడ్డి తెలిపారు.

కువైట్‌లో పోరుమామిళ్లవాసి మృతి


సూర్యసుబ్బయ్య (ఫైల్)

పోరుమామిళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద యరసాలకు చెందిన సూర్య సుబ్బయ్య (40) ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లాడు. కొన్ని సంవత్సరాల నుంచి ఇక్కడే ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అతను గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని యరసాలకు తెప్పించేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ... ఒకరికి తీవ్ర గాయాలు

వీరపునాయునిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.పాలగిరి క్రాస్ సమీపంలో శనివారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఎస్.పాలగిరి గ్రామానికి చెందిన నాగభూషణం అనే వ్యక్తికి కాలు విరిగింది. స్వల్పగాయమైన జగన్ అనే వ్యక్తిని 108 వాహనంలో చికిత్స కోసం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డ్రాగా ముగిసిన ఏసీఏ అండర్-14 క్రికెట్‌మ్యాచ్‌లు


వర్మ, రక్షణ్‌సాయి, కేపీ శ్రీరామ్

కడప స్పోర్ట్స్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు శనివారం డ్రాగా ముగిశాయి. ఏసీఏ క్రికెట్ స్టేడియంలో సెంట్రల్‌జోన్ విన్నర్స్-రెస్టాఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్ విన్నర్స్ మొద టి ఇన్నింగ్స్‌లో 79.3 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. రెస్టాఫ్ సెంట్రల్‌జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరుతో రెండవరోజు బ్యాటింగ్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 82 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 352 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో వర్మ 193 పరు గులు చేయడం విశేషం. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్టాఫ్ సౌత్‌జోన్-నార్త్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.1 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయ్యింది. నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 306 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో కేపీ శ్రీరామ్ 105 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కేవోఆర్ఎం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ విన్నర్స్-రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 48.2 ఓవర్లలో కేవలం 123 పరుగులకే అన్ని వికెట్లు కోల్పోయింది. రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి రోజు 41 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. రెండోరోజు తిరిగి బ్యాటింగ్‌కు దిగి 64.1 ఓవర్లలో 295 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో ఆ జట్టుకు 172 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. బౌలింగ్ విభాగంలో సౌత్‌జోన్ విన్నర్స్ బౌలర్ రక్షణ్‌సాయి ఏకంగా 6 వికెట్లు సాధించారు. ప్రతిగా రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు 62 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 197 పరుగుల స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన రెస్టాఫ్ నార్త్‌జోన్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 13 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

విద్యాభివృద్ధిలో యూటీఎఫ్ పాత్ర కీలకం


10వ తరగతి మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ షంషుద్దీన్, యుటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో యూటీఎఫ్ పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షంషుద్దీన్ తెలిపారు. శనివారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో యూటీఎఫ్ రాష్ట్రకమిటీ రూపొందించిన పదవ తరగతి మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిలో యూటీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విషయ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు రూపొందించిన ఈ మోడల్ పేపర్స్ పబ్లిక్ పరీక్షలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అన్ని గ్రేడ్‌ల విద్యార్థులకు ఇవి దోహదం చేస్తాయన్నారు. యూటీఎఫ్ నాయకులు బి.లక్ష్మీరాజా, మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ పేద, బడుగు వర్గాల విద్యార్థుల కోసం నాణ్యమైన విద్య అందించడంలో యూటీఎఫ్ నిరంతరం శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. మోడల్ పేపర్స్ కావాల్సిన వారు 9492805708, 9848021290 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ నాయకులు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

రద్దుచేసిన ఇంటి లబ్ధిదారుల డబ్బు ఏమైనట్లు ?

- కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు


మాట్లాడుతున్న చైర్మన్ వరప్రసాద్, హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

పులివెందుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీలో జగనన్న మెగా లేఅవుట్‌లో రద్దుచేసిన ఇంటి లబ్ధిదారుల డబ్బులు ఏమయ్యాయని పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. శనివారం స్థానిక మున్సిపల్ సభాభవనంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దాదాపు 7300 మంది పేదలకు ఇళ్లు మంజూరయ్యాయని, అవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఇంటి లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారంటూ పలువురిని తొలగించారన్నారు. అయితే అప్పటికే రూ.35వేలు చెల్లించి ఉన్నారని, ఆ డబ్బులు ఏమయ్యాయని హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు. దీంతో హౌసింగ్ ఏఈ రామసూరారెడ్డి మాట్లాడుతూ 6800 ఇళ్లు రిజిస్ట్రేషన్ అయ్యాయని, దాదాపు 300 ప్లాట్లు పలు కారణాలతో నిలిచిపోయాయని, 242 ప్లాట్లు కోర్టులో ఉన్నాయని వివరించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ పలు కారణాలతో నిలబడిన, కోర్టులో ఉన్న ప్లాట్ల లబ్ధిదారులతో పాటు అర్హులైన వారు కూడా రూ.35వేలు చెల్లించారని, వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంతలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కలుగజేసుకొని లబ్ధిదారులు చెల్లించిన డబ్బులు ఎవరు వాడుకోలేదన్నారు. రూ.9.58కోట్లు కమిషనర్, హౌసింగ్ ఏఈ జాయింట్ అకౌంట్‌లో ఉన్నాయని తెలిపారు. ఈవిషయం లబ్ధిదారులకు సమావేశం ద్వారా లేక మీడియా ద్వారా తెలియజెప్పాలని మున్సిపల్ కమిషనర్ రాముడు, హౌసింగ్ ఏఈలకు సూచించారు. అనంతర పలువురు కౌన్సిలర్లు లైట్లు, డ్రైనేజీ, వీధి కుక్కలుబెడద, ట్రాన్స్‌ఫార్మర్లు, పెండింగ్‌లో ఉన్న రోడ్లు తదితర సమస్యలను ఏకరువుపెట్టారు. వైస్ చైర్మన్‌లు వైఎస్ మనోహర్‌రెడ్డి, హఫీజుల్లా, రెవెన్యూ, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో మోసపోవద్దు : జేడీఏ

- రూ.2,389తో వరి ధాన్యం సేకరణ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు తాము పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు విక్రయించుకునే వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ జేడీఏ చంద్రానాయక్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి దిగుబడి ఆశాజనకంగా ఉందని.. రైతులు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో తొందరపడి మోసపోవద్దన్నారు. క్వింటాకు రూ.2,389లతో ఎంఎస్‌పీకి పీసీసీ ద్వారా వరి ధాన్యం సేకరిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణపై రైతుల్లో అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ పథకంలో నగదు జమకాని రైతులు తమ వివరాలతో సంబంధిత మండలాల వ్యవసాయశాఖ అధికారులను ఆశ్రయించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న తుఫాను నేపథ్యంలో వర్షాలు కురిసే సూచనలు ఉండడంతో అన్నదాతలు వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేయాలని సూచించారు. ఇది వరకు కోసిన ధాన్యాన్ని టార్పాలిన్ పట్టలతో కప్పి భద్రపరచుకోవాలని వివరించారు. ఏడీఏ అనిత, ఏవో వరహరికుమార్, చెన్నమరాజుపల్లె వీఏఏ సుమలత, రైతులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పి స్తామని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలి పారు. శుక్రవారం రాత్రి అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో ఉన్న ఏపీ గిరిజన బాలికల పాఠశాల ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ పాఠశాలలో వసతులను పరిశీలించామని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన వనరుల న్నీ సమకూరుస్తామని తెలిపారు. పాఠశాలకు అవసరమైన వనరులను ఉపాధ్యాయులను అడి గి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. పాఠశాలలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థినులతో ఆరా తీశారు. తల్లికి వందనం వంటి పథకాలు అందుతున్నా యా లేదా అని తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

మైనారిటీలకు కూటమి ప్రభుత్వం అండ

రైల్వేకోడూరు రూరల్ : మైనారిటీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపా నందరెడ్డి తెలిపారు. శనివారం కోడూరు పట్టణంలోని జామియా మసీదులో ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలకు సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈద్గాను అతి త్వరలో పూర్తి చేసి కానుకగా ఇస్తామని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మైనారిటీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేర కు మసీదుల మరమ్మతులకు నిధులు, ఇమామ్ లు, మౌజన్‌లకు గౌరవ వేతనం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని తెలి పారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేం ద్ర, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పటాన్ మౌలా, జామి యా మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ప్రారంభం

పుల్లంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని టి.కమ్మపల్లె క్రాస్ నుంచి ఎగువరెడ్డిపల్లె వరకు ఏర్పాటు చేసిన వీధిలైట్లను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ శనివారం ప్రారంభించారు. వీటి ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించిన ఎగువరెడ్డిపల్లెకు చెందిన విశ్రాంత టీచర్ కుప్పల రామకృష్ణయ్యను ఎమ్మెల్యే అభి నందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకు లు ముక్కా వరలక్ష్మి, చంద్రశేఖర్‌నాయుడు, రామచంద్రనాయుడు, కుప్పాల మల్లి, ఏఈ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

మండలంలోని టి.కమ్మపల్లెకు చెందిన వెంకటేశ్వ ర్లుకు రూ.40 వేలు వెంకటయ్యనాయుడుకు రూ. 25,166, వెంకటసుబ్బమ్మకు రూ.32028, ఎగువ రెడ్డిపల్లెకు చెందిన సుమంత్ రూ.59800 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఎమ్మె ల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్కా వరలక్ష్మి, చంద్రశేఖర్ నాయు డు, కృష్ణమనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్త పడాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మరొ క తుఫాను రాబోతుందని, వరి, ఇతర ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్త పడాలని మండల వ్యవ సాయ అధికారి రాజకుమారి తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని పంట దెబ్బతినకుండా ఉండేందుకు పంట కోత ముందు, పంట కోత తర్వాత జాగ్రత్తలు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. తుఫాన్ తగ్గే వరకు పంట తడవకుండా పట్టలు కప్పుకోవాలన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ విద్యా సామగ్రి వితరణ

పుల్లంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల కు మాజీ సర్పంచ్ రొంపిచెర్ల ఆదినారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మురళీ శనివారం మైక్‌సెట్, విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, వాటర్‌బాటిళ్లు పంపిణీ చేశారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన

సిద్దవటం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠువ్యాధి, బ్లడ్ కేన్సర్ నిర్మూలనపై శనివారం సిద్దవటం, దిగువపేట, ఆకుల వీధిలో పి.కొత్త పల్లె ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్‌సూపర్‌వైజర్ మౌలాలి అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీ సర్ లోకేశ్వరి, ఆరోగ్య కార్యకర్త శారదా, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

నందలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైల్వేకేంద్రంలోని హజరత్ ఖాదర్‌వలి 134 ఉరుసు సందర్భంగా శుక్రవారం రాత్రి గంధం ఉత్సవం నిర్వహించారు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మే డా విజయశేఖర్‌రెడ్డి, జనసేన నాయకుడు అతి కారి కృష్ణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ దర్గాను సందర్శించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యుత్ కంచె తగిలి గేదె మృతి

● గుట్టుగా మృత కళేబరం మాయం

వీరబల్లి,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అడవి జంతువులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి ఓ గేదె మృతి చెందగా, విష యం బయటికి రాకుండా ఉ ండేందుకు దానిని ముక్కలుగా నరికి వేర్వేరు ప్రాంతాల్లో పడేసిన సంఘటన శనివారం వెలుగు లోనికి వచ్చింది. మండల పరిధిలోని వంగిమళ్ల పంచాయతీ కావలిగడ్డ సమీపంలోని తోటల్లో కొంతమంది విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం ఆ కంచె తగిలి రామచంద్ర అనే వ్యక్తికి చెందిన గేదె మృతి చెందింది. విషయం తెలుసు కున్న రామచంద్ర శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు గేదెకు సంబంధించిన చిన్నచిన్న మాంసం ముక్కలను పాడుబడిన బోరుబావిలో, పెద్ద ముక్కలను కాలువలో పడేసినట్లు గుర్తించా రు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయచోటి సబ్‌జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

రాయచోటిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సివి ల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫకృద్దీన్ శనివారం రా యచోటి సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు జైలులోని రిజిస్టర్లను పరిశీలించా రు. అనంతరం మాట్లాడుతూ సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ప్రాధాన్యతను తెలియజేశారు. ఖైదీల హ క్కులు, ఉచిత న్యాయ సహాయం, లీడల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విష యాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయసహాయంను సద్విని యోగం చేసుకోవాల న్నారు. జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం, న్యాయ సహాయం అంశాలను వివరించారు. అనంతరం జైలు పరిసరాల ను, టాయిలెట్లను, వంట గదిని, వసతి గదులను, పరిశీలించి జైలు సిబ్బందికి తగు సూచన లు, సలహాలు ఇచ్చారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్ జైలు సూపరిండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న మహేశ్‌నాయుడు

సుండుపల్లె, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): రోడ్ల మరమ్మ తులకు ప్రభుత్వం రూ.5.50 కోట్లు మంజూరు చేయడం అభినందనీయ మని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేశ్ నాయుడు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అర్థాంతరంగా ఆగిపోయిన సుండుపల్లె, రాయచోటి రోడ్డు మరమ్మతులు, సానిపాయి, రాయచోటి మధ్య రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రోడ్లు, భవనాలశాఖ అధికారుల ప్రతిపాదనల మేరకు నిధులు మంజూరు చేయడం, అభివృద్ధికి శుభసూచక మన్నారు. రోడ్ల భవనాల శాఖ, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి , నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రతిపాదనలు పంపి సకాలంలో నిధులు మంజూరుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటుకు చర్యలు



తరగతి గదులను తనిఖీ చేస్తున్న డీఈవో షంషుద్దీన్

సిద్దవటం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తరగతి గదు ల్లో ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యా ర్థులకు ఏ రకమైన పుస్తకాలు ఇష్టపడతారో విద్యార్థులను అడిగి తెలుసుకుని ఆ పుస్త కాలను సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా మంజూరు చేయించి వారానికి రెండు రోజులు లైబ్రరీ ఏర్పాటు చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ తెలిపారు. సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐదు గ్రూపులుగా ఏర్పడి పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను అడిగి వివరాలు సేకరిస్తున్నామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులతో ఆరా తీశారు.

'సుండుపల్లెను రాయచోటి డివిజన్‌లో చేర్చాలి'

సుండుపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె, వీరబల్లి మండలా లను రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేసినట్లు జనసేన నేత రామ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో ఉండడంతో సుమారు 70 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించింద న్నారు. రాయచోటి 20 కిలోమీటర్ల దూరంలోనే ఆ డివిజన్‌లో చేరిస్తే రైతు లకు ఎంతోమేలు చేకూరుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత ప్రభు త్వంలోనూ వైసీపీ నాయకులు సుండుపల్లె, వీరబల్లి మండలాలను రాయచోటి రెవెన్యూ డివిజన్‌లోకి మారుస్తామని రెండు మండలాల రైతులు ప్రజలు మోసం చేశారని తెలియజేశారు.

ఉద్యోగులకు కంట్రోల్ రూమ్‌లో విధుల కేటాయింపు

రాయచోటి నేతాజీ సర్కిల్ , నవంబరు 29: జిల్లాలో తుఫాను పరిస్థితుల కారణంగా సంబేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా ఉద్యోగులకు విధులు కేటాయించినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి తెలియజేశారు. తుఫాను సహాయక చర్యల్లో భాగంగా వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, సర్వేయర్లతో పాటు ఆర్‌ఐ, జూనియర్ అసిస్టెంట్లు 29వ తేదీ నుంచి డిసెంబరు 1 వరకు అందుబాటులో ఉండేలా నియమించినట్లు తెలియజేశారు. వరదల వల్ల వర్షాలు వల్ల ఏదైనా సమస్యలు ఎదురైతే ప్రజలు కంట్రోల్ రూమ్ ఫోన్ చేసి వెంటనే సహాయక చర్యలు పొందవచ్చునని తెలియజేశారు. తుఫాన్ సహాయక చర్యలు చేపట్టేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. జిల్లాలో తుఫాను పరిస్థితుల దృష్ట్యా ప్రజలను అప్రమ త్తం చేయాలని సంబేపల్లె ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి శనివారం అధి కారులకు తెలియజేశారు. పాడుబడ్డ భవనాలు, వాగులు, కుంటల వద్దకు పిల్లలు, వృద్ధులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

చిట్వేలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో యూనిట్‌కు సంబం ధించిన వృత్తి విద్య ఉపాధ్యాయులు విద్యార్థులతో చక్కెర, నూనెలను వాడకుండా ఆరోగ్యకరమైన డ్రైఫ్రూట్స్ మిల్లెట్స్, కూరగాయలు, పండ్లు, ఆరోగ్యకరమైన స్నాక్స్ తయారు చేసి స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దొరకరాజు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారంపై విద్యార్థుల్లో అవగాహన పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడ తాయన్నారు.

భూ వివాదం పరిష్కారం



వివాదాస్పద స్థలంలో పోలీసులు

రైల్వేకోడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత 20 ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదా న్ని శనివారం రెవెన్యూ అధికా రులుపరిష్కరించారు. తహ సీల్దార్ కోనేటి అమర్‌నాథ్ కథ నం మేరకు.....సర్వే నెంబర్లు 7, 13 లోని 4.60 ఎకరాల భూమిని 20 ఏళ్ల క్రితం 120 మంది కొనుగోలు చేశారు. అయితే వారిని ఆ స్థలంలోనికి వెళ్లకుండా కొందరు అడ్డుకున్నారు. అప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది. ఈ మధ్యకాలంలో బాధితులు విష యాన్ని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేశారు. 20 రోజుల క్రితం సబ్ కలెక్టర్ భావన, ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే ఇరువర్గాలను సమా వేశపరిచి కొనుగోలుదారులే అసలు హక్కుదారులని తేల్చారు ఈ భూమిలో హక్కు ఉందని తేల్చారు. పోలీసు బందోబస్తు నడుమ కొలతలు వేసి యజ మానులకు అప్పగించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఉపాధ్యాయ క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు

గాలివీడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) ఉపా ధ్యాయుల్లో మానసిక ఉల్లాసం, శారీరక దృఢ త్వంపై అవగాహన కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎం ఈవో నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఇం దులో భాగంగా శనివారం ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు, ఉపాధ్యాయులకు క్రికెట్ పో టీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన సభ్యులు డిసెంబర్ 13న రాయచోటిలో డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, చిన్నకోట్ల గం గరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈ వోలు, గాలివీడులోని ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుల్లంపేట : స్థానిక ఎస్‌బీవీడీ సభ హైస్కూల్ క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించగా 49 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సాయిరాం ఆధ్వర్యంలో జోనల్ స్థాయి టీమ్‌ను సెలక్టు చేశారు. ఈ ఎంఈవో లు చక్రధర్‌రాజు, నాగ తిరుమల రావు, పీఈటీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నందలూరు: రాయచోటి డిప్యూటీ డీఈవో ఎల్.నాగయ్య, మండల విద్యాశాఖాధికారి-2 అనంతకృష్ణ, నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, క్రీడల మండల కోఆర్డినేటర్ గౌరి ఆధ్వర్యంలో అరవపల్లె క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించారు. క్రికెట్ జట్టుకు 16 మంది ఉపాధ్యాయులు, త్రోబాల్ జట్టుకు 12 మంది ఉపాధ్యాయినులు ఎంపికయ్యారు. వీరు డివిజన్ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించండి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగోళ్ల రెడ్డెయ్య యాదవ్, తహసీల్దార్ కాంత్రికుమార్‌కు శనివారం వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆయా సమస్యలపై ఆరా తీ యాలన్నారు. కొత్త రేషన్‌కార్డులు వచ్చేటట్లు చూడాలన్నారు. ఈ కార్య క్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, బడుగు వాసు దేవుడు, ధర్మారెడ్డి, దిన్నెపాడు చెరువు సంఘం చైర్మన్ మోహన్‌రెడ్డి, నియోజకవర్గ మైనార్టీ టీడీపీ యువజన నాయకుడు షేక్.ఆరీఫ్, జీకే రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన



ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

రాయచోటిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓటరు న మోదుపై ప్రతి ఒక్కరూ అవ గాహన కలిగి ఉండాలని ఎన్ ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్ర సన్న కుమార్ తెలిపారు. శని వారం దూళ్లవారిపల్లెలో ఎన్ ఎస్ ఎస్ వలంటీర్లు ఓటర్ గా నమోదు చేసుకోవడం ఎలా అన్న అంశంపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు న మోదు చే యాల న్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేఖ, ఉపాధ్యాయులు సుబ్బా రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

మండలాలవారీగా బీజేపీ సభ్యత్వ నమోదు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల్లో మండలాల వారీగా బీజేపీ సభ్యత్వ నమోదు చేయనున్నట్లు మండల బీజేపీ మండల ఇన్‌చార్జి జానం బాలాజీయాదవ్ తెలిపారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలో బీజే పీ నాయకులతో మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని ఆయన తెలియజేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా బాలాజీ యాద వ్, కన్వీనర్‌గా సిద్దప్పనాయుడు, లక్కీ శశిధర్, పళ్ల పురుషోత్తం ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్‌మోర్చా మాజీ సభ్యుడు కొర్లకొండ కృష్ణ, మండల మాజీ అధ్యక్షుడు జయచంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి చెంచర్ల ఆంజనేయులు, రామచంద్ర, గౌరీ, అబ్బాస్ అలీఖాన్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజిస్ట్‌ను నియమించండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శివరాంనాయుడు

సుండుపల్లె, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి):సుండుపల్లె ప్రాథమిక వైద్య కేంద్రంలో గైనాలజిస్ట్‌ను నియమించాలని కోరుతూ మండల టీడీపీ ఆర్గ నైజింగ్ సెక్రటరీ శివరాం నా యుడు శనివారం కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశా రు. సుమారు 80 వేల జనాభా కలిగిన సుండుపల్లె మండలంలో గైనకాలజీ సమస్యలు పరిష్కరించడానికి డాక్టరు అందుబాటు లో లేరని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో వైద్యం కోం సుమారు 40 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. వారం రోజుల్లో డాక్టర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారం ప్రభుత్వ లక్ష్యం

సుండుపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్య ల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్య మని రాజంపేట మార్కెట్ యార్డు చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్యనాయుడు తెలిపారు. శనివారం మండలంలోని మడి తాడు గ్రామ పంచాయతీలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ కరపత్రాలను రైతులకు అందజేసి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కృషిని కొనియాడారు. ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చప్పిడి రమేశ్‌నాయుడు, జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు యూనియన్ బాషా, వెంకట్రామరాజు, నూరుల్లాఖాన్, రియాజుల్లా తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే తప్పకుండా చేయాలి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో రాధమ్మ

ఓబులవారిపల్లె, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం నిర్దే శించిన సర్వేలను తప్ప కుండా చేయాలని జి ల్లా పంచాయతీ అధికారి రాధమ్మ సూచించారు. శనివారం స్థానిక ఎంపీ డీవో కార్యాలయాన్ని ఆ మె పరిశీలించారు. మం డల పరిధిలో స్వామిత్వ సర్వే, హౌస్ టాక్స్ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. మండలంలో అభివృద్ధి పనుల పైన చర్చించారు. పంచాయతీలవారీగా అభివృద్ధి పనుల వివరాలను కార్య దర్శులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సర్వేలు తప్పకుండా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజ యరావు , ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

దోమల నివారణ బత్తీలు వినియోగించవద్దు

ఒంటిమిట్ట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు ఆషికాస్ స్లీప్‌వెల్ బ్రాండ్ అగరబత్తీలను వినియోగించవద్దని మండల వ్యవసాయా ధికారి మంజుల రాణి తెలిపారు. శనివారం ఒంటిమిట్టలోని పలు ఏజెన్సీల్లో తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ అగరబత్తీలో ప్రాణాంతకమైన మెపర్ ఫ్లత్రిన్ అనే పురుగు మందు అవశేషాలు ఉన్న ట్లు ప్రయోగశాలలో నిర్ధారణ అయ్యిందన్నారు. వీటి వాడడంతో శ్వాసకోశ వ్యాధులబారిన పడే ప్రమాదం ఉందన్నారు. వీటిని విక్రయిస్తే క్రిమిసంహార క చట్టం మేరకు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

సిద్దవటం మండల విభజనపై జేఏసీ ఏర్పాటు

సిద్దవటం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్యజిల్లా రాయచోటిలో సిద్దవటం మండలాన్ని విలీనం చేస్తూ కూటమి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంతో మండలంలోని ప్రజలు శనివారం మాధవరం-1 గ్రామ పంచాయతీ బంగారుపేట, గంగాభవాని ఆలయంలో 14 మందితో జేఏసీ ఏర్పాటు చేశారు. జేఏసీ అధ్యక్షుడుగా సొట్టు అమర్‌నాథ్‌శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడు తూ ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం తగదని మండిపడ్డారు. సిద్దవటం మండలాన్ని రాయచోటిలో కలిపే నిర్ణయాన్ని వాపసు తీసుకోవాలని లేదంటే ఉద్యమాలు, రాస్తారోకోలు, రిలే నిరాహార దీక్ష లు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. .

మండల టీడీపీ కో క్లస్టర్ ఇన్‌చార్జిగా చుక్కా యానాది

నందలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల కోక్లస్టర్ ఇన్ చార్జిగా చుక్కా యానాది ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎంపికచేసిన రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు మండల ముఖ్య నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. మండలంలో తెలుగుదేశంపార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తానని కార్యకర్తలకు అందుబాటులో ఉండి కార్యకర్తల సమస్యలపై పరిస్కారం కోసం కృషి చేస్తానన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రైల్వేకోడూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మహిళలు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని రైల్వేకోడూరు ఐసీడీఎస్ సీడీపీవో రేణుక తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నియోజక వర్గంలోని వివిధ గ్రామాల్లో 8 ఆయా పోస్టులు, 2 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నా యన్నారు. జూలై 1, 2025 నాటికి 21 ఏళ్ల లోపు వయసు నిండిన మహిళలు రేషన్ కార్డుతో పాటు తహసీల్దారు జారీ చేసిన నివాస స్థలం ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, స్టడీ, బదిలీ, మార్కుల జాబితా తదితర పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అంగన్వాడీ పోస్టుకు తప్పని సరిగా 10 పాసైన సర్టిఫికెట్ ఉండాలన్నారు. అంగన్వాడీ సహాయకురాళ్ల పోస్టులకు కూడా 10వ ఉత్తీర్ణత సర్టిఫికేట్ లేక పోతే దిగువ తరగతులలో అత్యధిక అర్హత కల్గిన అభ్యర్థిని పరిగణన లోకి తీసుకుంటామని తెలిపారు. డిసెంబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటలకు దరఖాస్తులు ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం రైల్వేకోడూరు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గాలివీడు: మండలంలోని గాలివీడు పంచాయతీ పక్కీరారెడ్డిగారిపల్లె, అరవీడు పంచాయతీకస్పాలో అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో జహరాబీ ఒక ప్రకటనలో తెలిపారు.

రాజంపేట :

రాజంపేట ఐసీడీసీఎస్ ప్రాజెక్టు పరిధిలో 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి తెలియజేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలు రాజంపేట ఐసీడీఎస్ కార్యాలయంలో లభ్యమవుతాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తలను అవసరమగు ధ్రువీకరణ పత్రాల నకలుతో డిసెంబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోపుల సమర్పించాలని తెలిపారు.

మదనపల్లె జిల్లా పేరెత్తని వైసీపీ

- అంశాలపై చర్చ జరగకుండానే అన్నీ 'ఓకే'
- ఆమోదంతో ముగిసిన కౌన్సిల్ సమావేశాలు
- ఆ పదంతోనే 55 అంశాలకూ మోక్షం
- జిల్లా ప్రకటనపై టీడీపీ కౌన్సిలర్ల హర్షం




జిల్లా ప్రకటనపై ధన్యవాదాలు చెబుతున్న కౌన్సిలర్లు, కౌన్సిల్‌లో మేం చెప్పిందే జరుగుతుందంటున్న చైర్‌పర్సన్ మనూజ

మదనపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రకటనపై టీడీపీ కౌన్సిలర్ పచ్చిపాల తులసి, మరో ఇద్దరు టీడీపీ మద్దతుదారులైన కౌన్సిలర్లు మార్పూరి నాగార్జునబాబు, ఎస్.కరీముల్లాలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు, ఆ తర్వాత మాటిచ్చినట్లు హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ పట్టుబట్టి ముందుండి అమలు చేయించిన స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు జిల్లా సాధనకు పోరాటాలు చేసిన ఉద్యమవీరులకు అభినందనలు తెలిపారు. జిల్లా ప్రకటనతో మన కౌన్సిల్, దీనిని సాధించిన ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని ఆ ముగ్గురు కౌన్సిలర్లు ప్రకటించారు. అయితే మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ సహా వైసీపీ కౌన్సిలర్లు ఎవరూ వీరి ప్రకటనకు మద్దతు పలకపోగా, సమావేశం ప్రారంభమై చైర్‌పర్సన్ ప్రసంగం చేయకనే జిల్లా అంశం ఎందుకని లేవనెత్తారని ప్రశ్నించారు.

జిల్లా అయిన సంతోషం కూడా వైసీపీ కౌన్సిలర్లు వ్యక్తం చేయకపోగా, ఆ అంశాన్ని లేవనెత్తి ధన్యవాదాలు తెలిపే క్రమంలో కౌన్సిలర్లు పి.తులసి, నాగార్జునబాబు, ఎస్.కరీముల్లాపైనే ప్రతిగా పరోక్షంగా ఎదురు దాడి చేయడం, రాష్ట్రంలో ప్రభుత్వం ఏదున్నా.. ఇక్కడ పాలకవర్గం చెప్పినట్లే జరుగుతుందని చైర్‌పర్సన్ ప్రకటించడంపై వైసీపీ నైజం మరోసారి బహిర్గతం అయినట్లయింది. ప్రభుత్వాన్ని పొగడటాన్ని, సాధించిన విషయాన్ని చెప్పుకోవడానికి కూడా ఇష్టం లేదని ఆ ముగ్గురు కౌన్సిలర్లు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఉదయం 11:30 గంటలకు మొదలు కావాల్సిన సమావేశం అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. సమావేశం ప్రారంభంలోనే టీడీపీ మద్దతు కౌన్సిలర్లు మదనపల్లె జిల్లా ప్రకటనకు ధన్యవాదాలు తెలిపే అంశాన్ని లేవనెత్తడంతో చైర్‌పర్సన్‌కు విలువ ఇవ్వకుండా ముందుగానే ఆ అంశాన్ని ప్రస్తావించడం ఏంటని వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. తర్వాత అజెండాలోని అంశాలపై చర్చ ప్రారంభం కాగానే, ఆ అంశాన్ని వాయిదా వేయండని వైసీపీ కౌన్సిలర్లు చెప్పడాన్ని స్వపక్షంలోనే విపక్ష కౌన్సిలర్ షేక్ కరీముల్లా అందుకు ప్రతిగా అడ్డుతగిలారు. అజెండాలోని అంశాన్ని చదవకనే, దానిపై చర్చ జరగకుండానే వాయిదా వేయండని ఎలా చెబుతారని, కౌన్సిల్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా? అంటూ ఎదురుదాడికి దిగడంతో ఇరువర్గాల మధ్య వివాదానికి తెరలేసింది. వీటిపై చర్చ జరగాల్సిన అవసరం లేదన్నట్లు మున్సిపల్ వైఎస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి అన్ని అంశాలూ ఆమోదం అంటూ ప్రకటించారు. దీంతో మిగిలిన కౌన్సిలర్లు కూడా మద్దతుగా సమావేశం నుంచి బయటకు వెళ్లే ప్రయత్నం చేశారు.

అంతలో మరో కౌన్సిలర్ బి.ఎ.ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ ఇక్కడి కౌన్సిల్‌లో టీడీపీ కౌన్సిలర్ ఉన్నది ఒకరేనని, మిగిలిన ఇద్దరు వైసీపీ నుంచి గెలిచి టీడీపీకి మద్దతుగా నిలవడాన్ని తప్పుపట్టారు. ముగ్గురు చెప్పే అంశాలను మేం ఎలా ఒప్పుకుంటామని మెజారిటీ మేమే ఉన్నామనే ధోరణి ప్రదర్శించడంతో కౌన్సిల్‌లో కొంతసేపు గందరగోళం నెలకొంది. దీంతో ఆ ముగ్గురు కౌన్సిలర్లు సమావేశం నుంచి బయటకు వచ్చేయగా, వైసీపీ కౌన్సిలర్ ప్రసాద్‌బాబు అజెండాలోని రెండు అంశాలను వాయిదా వేయాలని కోరారు. అప్పటికే అన్ని అంశాలు ఆమోదించేశామని, సమావేశం ముగిసిందని వైసీపీ కౌన్సిలర్లంతా బయటకు వచ్చేశారు. ఆ అంశాలను అవసరాన్ని బట్టి తానే ర్యాటిపై చేశారని చైర్‌పర్సన్ చెప్పడంతో కౌన్సిలర్ ప్రసాద్‌బాబు కూడా అంగీకరించినట్లయింది. రెండు సమావేశాలు చేపట్టి, వాటిపై చర్చ జరగకుండానే కేవలం అయిదు నిమిషాల్లో ఆమోదం, అంతా అయిపోయిందని, ఎలా ప్రకటిస్తారని స్వపక్షంలోనే విపక్ష కౌన్సిలర్ కరీముల్లా వాపోయారు. ఇలా ఇంకా ఎన్నాళ్లు? ఇలా చేస్తారు.? ఇదేనా? ప్రజాస్వామ్యం అంటూ నిలదీశారు. మెజారిటీ మీదే ఉందని, ఇంతకాలం ఇలానే చేశారు? అభివృద్ధే లేకుండా చేశారని, ఇక వార్డుల్లోకి పోతే జనాలే చెబుతారంటూ నిట్టూరుస్తూ బయటకు వచ్చేశారు.

అనంతరం చర్చ లేకుండా ఆమోదించిన అంశాలను పరిగణలోకి తీసుకోవద్దని, ఆ అంశాలను రీషెడ్యూల్ చేయాలని, లేకుంటే న్యాయపరంగా ముందుకెళ్తానని కరీముల్లా, మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు సూచించారు. ఇదిలా ఉండగా, స్వపక్షంలోనే విపక్షంగా ఏడాది కాలంగా అభ్యంతరాలు, ఆటంకాలతో కొన్ని వాయిదా పడుతూ, మరి కొన్ని రద్దయిన వాటితో కలిపి సాధారణ, అత్యవసర అజెండాల్లోని 55 అంశాలూ 'ఆమోదం అనే పదంతో పూర్తయ్యాయి. దీంతో అటు మున్సిపల్ అధికారులు, అటు కాంట్రాక్టర్లు ఊపిరి పీల్చుకున్నట్లయింది.

మదనపల్లెలో తగ్గిన ఉష్ణోగ్రత

పగలు 22... రాత్రి 16 డిగ్రీలు



సాయంత్రం 4 గంటలకే తట్టివారిపల్లె చెరువు వద్ద కురుస్తున్న మంచు

మదనపల్లె టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసలే చలికాలం..అందులోనూ దిత్వా తుఫాను ముంచుకొస్తున్న తరుణంలో మదనపల్లె ప్రాంతంలో ఉష్ణోగ్రతలు హఠాత్తుగా పడిపోయాయి. సాధారణంగా మదనపల్లెలో పగలు 30 డిగ్రీల సెల్సియస్, రాత్రిళ్లు 24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు కనిపించడం పరిపాటి. కాగా రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గిపోతుండగా, శనివారం దిత్వా తుఫాను కారణంగా మదనపల్లెలో చల్లనిగాలులతో, పగలే మంచుకురుస్తూ వాతావరణం చల్లగా మారిపోయింది. ఆరోగ్యవరంలోని ఉష్ణోగ్రత పరీక్ష కేంద్రంలో నమోదైన వివరాలు మేరకు.. శుక్రవారం రాత్రి 16 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, శనివారం పగటి ఉష్ణోగ్రత 24 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. దీంతో ప్రజలు పగలే స్వెటర్లు, మంచు ధాటికి గొడుగులు పెట్టుకుని నడవడం కనిపించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువు వాసులు అశోక్, ఇబ్రహీంలు పని నిమిత్తం ద్విచక్రవాహనంలో బస్టాండుకు బయలుదేరారు. ఈ క్రమంలో స్థానిక రైల్వేగేటు సమీపంలో ద్విచక్రవాహనం, బొలేరోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడడంతో చికిత్సల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



వెంకటేశ్ మృతదేహం

రామాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నటు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ బీసీ కాలనీకి చెందిన రౌతు వెంకటేశ్ (39), కళావతి దంపతులకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తె సంతానం. ఇటీవల కళావతి ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లింది. అయితే, అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రామాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

కలికిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పరిశ్రమలు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకారాలందించి ప్రోత్సహిస్తామని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి హామీ ఇచ్చారు. శనివారం ఆయన కలికిరి శివార్లలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూములను పరిశీలించారు. ఈ పారిశ్రామికవాడలో స్థాపించిన ఎస్ఆర్‌కే ఫుడ్స్, చేగు ఫుడ్స్ యూనిట్లను పరిశీలించారు.

ఎస్ఆర్‌కే ఫుడ్స్‌లో ఏళ్ల గడుస్తున్నా ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌కే ఫుడ్స్‌లో వివిధ రకాల ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించేందుకు ముందుకొస్తే ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహకారం అందజేస్తామని చెప్పారు. అన్ని రకాల అనుమతులను సింగిల్‌విండో పద్ధతిలో త్వరితగతిన మంజూరు చేస్తామని కూడా చిరంజీవి చౌదరి చెప్పారు. అదేవిధంగా కొత్తగా ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలను అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణకిశోర్, ఇతర ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టులో కడప క్రీడాకారిణి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే నెట్ బాల్ క్రీడల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడే అండర్-14 బాలురు, బాలికల జట్టును శనివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో పరిశీలకులు కల్పన, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు సునీత, మల్లేశ్వరరావు, పీడీలు చిట్టిబాబు, ఖుద్దూస్, విజయలక్ష్మి తదితర పీడీలు ఎంపిక చేశారు.

బాలికల జట్టు: బి.భాగ్యశ్రీ (విశాఖపట్నం), ఎన్.వెంకట నాగ భవానీ ఈక్షిత (విశాఖపట్నం), పల్లి శ్రీగాయత్రి (విశాఖపట్నం), పెచ్చెట్టి బిందుశ్రీ మంజు (పశ్చిమ గోదావరి జిల్లా), పి.వసుంధర (పశ్చిమ గోదావరి), యండమూరి హన్నా (కృష్ణా), సీహెచ్ విద్యాలక్ష్మి (తూర్పు గోదావరి), ఎం.ప్రణీత (కడప), ఎంకే కీర్తిక (చిత్తూరు), ఎం.అమూల్య (గుంటూరు), డి.మెహరీన్ (నెల్లూరు), జి.తేజశ్రీ (పశ్చిమ గోదావరి జిల్లా).

బాలుర జట్టు : కె.సోహిల్ (విశాఖపట్నం), ఎం.ధనుష్ మణికంఠ (విశాఖపట్నం), పి.చందు వెంకట నిఖిల్ (విశాఖపట్నం), ఎం.వెంకట శ్రీనివాస్ కుమార్ (తూర్పు గోదావరి), కె.సృజన్ (తూర్పు గోదావరి), కె.ఆంటోని (పశ్చిమ గోదావరి), బి.లోకేష్ (కృష్ణా), వి.ఢిల్లీబాబు (నెల్లూరు), కెవి బాలు (గుంటూరు), ఆర్.అజయ్‌కుమార్ (విజయనగరం), టీజే శేషాద్రి (చిత్తూరు), వి.గౌతమ్‌బుద్ధ (పశ్చిమ గోదావరి జిల్లా).

రాజంపేటను జిల్లా కేంద్రం చేయండి

- రైల్వేకోడూరులో కీలక సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ, జనసేన ఇతర పార్టీల నేతలు




కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజంపేట, కోడూరు జేఏసీ నాయకులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజంపేట నేతలు

రాజంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లె జిల్లాను ప్రకటించి యదావిధిగా రాయచోటి జిల్లా కేంద్రం కొనసాగింపుపై రాజంపేట, కోడూరులలో ఉద్యమం తీవ్రతరమవుతోంది. ఇందులో భాగంగా శనివారం రైల్వేకోడూరులో అన్ని రాజకీయ పక్షాలు సమావేశమై రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని తీర్మానించారు. ఈ మేరకు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు విజ్ఞాపనపత్రాన్ని అందజేశారు. శనివారం కడప జిల్లా గండికోటలో జరిగిన బీజేపీ సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ బీజేపీ రాజంపేట నేతలు సురేశ్‌రాజు, రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అలాగే రైల్వేకోడూరులో అన్ని రాజకీయ పక్షాలు సమావేశమై రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని రెండు నియోజకవర్గాల్లోని అన్ని రాజకీయ పక్షాలు ఏకకంఠంతో విజ్ఞప్తి చేశాయి. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కీలక సమావేశానికి ఎమ్మెల్యే శ్రీధర్‌తో పాటు రాజంపేట, కోడూరు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, జనసేన, ఇతర రాజకీయ పక్షాల నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా తమ నియోజకవర్గవాసులు అంగీకరించబోమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి అందరికీ ఆమోదయోగ్యమైన ప్రజల అభీష్టాన్ని వివరించి నినదించి తమకు జిల్లా విషయంలో న్యాయం చేయాలని కోడూరు, రాజంపేట వాసులు కోరారు. కార్యక్రమంలో కోడూరు నాయకులతో పాటు రాజంపేట జేఏసీ నేతలు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి రమణ, వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు ఎమ్మెల్యేకు విజ్ఞాపన పత్రం అందజేశారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని, జిల్లా కేంద్రం చేస్తే తమ మండలాలను అన్నమయ్య జిల్లాలో ఉంచాలని లేదంటే రాయచోటిని జిల్లా కేంద్రం కొనసాగిస్తే ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడపలోనే ఉంచాలని ఆయా మండలాల వాసులు కడప జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు.

గురువుల క్రీడోత్సాహం..



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రెడ్డిభాష

పీలేరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గురువుల క్రీడోత్సవంతో కేవీపల్లె మండలం గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. శనివారం కేవీపల్లె మండలంలోని ఉపాధ్యాయులకు గ్యారంపల్లె గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో క్రీడలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో రెడ్డిబాష మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని చెప్పారు. నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. పురుషులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు.



త్రోబాల్ ఆడుతున్న మహిళా ఉపాధ్యాయులు

క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 15 మందిని, త్రోబాల్ నుంచి 12 మందిని డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. డిసెంబరు 13వ తేదీ డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో వీరు కేవీ పల్లె మండలం తరఫున పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడా పోటీలలో కేవీ పల్లె ఎంఈవో-2 సుబ్రమణ్యంరెడ్డి, ఏపీఆర్ఎస్ గ్యారంపల్లె గురుకుల ప్రిన్సిపాల్ నూర్ అహ్మద్, కేవీపల్లె, జీ కొత్తపల్లె హైస్కూల్ హెచ్ఎంలు వై.వీ.రమణ, సరస్వతి, మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి బొట్టు వృథా కానివ్వొద్దు : కలెక్టర్



రామరాజువంకను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రామాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పడే ప్రతి నీటి బొట్టును వృథా కానివ్వకుండా సప్లయ్ చానల్స్ ద్వారా చెరువులు నింపే ప్రక్రియను పూర్తి చేయాలని నీటి పారుదల, వెలిగల్లు ప్రాజెక్టు అధికారులకు కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. శనివారం రామాపురం మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లి గ్రామ పరిధిలోని రామరాజువంక నుంచి బిల్లిగుట్ట చెరువు సప్లయ్ చానల్ పనులను, రామరాజు వంక చెక్‌డ్యాం నిర్మాణానికి సంబంధించిన పనులను, రామరాజు వంక నుంచి ఓబుల్‌రెడ్డి చెరువు, కసిరెడ్డి చెరువుకు, దిగువ చింతలవారికుంట, చింతకుంట నింపు సప్లయ్ చానల్ పనులను కలెక్టర్ పరిశీలించారు. వర్షాకాలంలో నీటిని వృథాగా పోనివ్వకుండా చెరువులు అన్నీ నింపే ప్రక్రియ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సప్లై ఛానల్ ద్వారా చెరువులకు నీటిని నింపడం వలన బల్లగుట్టపల్లి చెరువు ద్వారా 225 ఎకరాలకు, కసిరెడ్డి చెరువు, ఓబుల్‌రెడ్డిచెరువు ద్వారా దాదాపు 109 ఎకరాలకు నీరు అందిస్తామన్నారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో ప్రతి చెరువు నీరు నింపే విధంగా సప్లయ్ చానల్ పనులు రేపట్టే విధంగా ప్రణాళికలు తయారు చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఈనెల 30వ తేదీ పదవీ విరమణ చెందుతున్న నీటి పారుదలశాఖ ఎస్ఈ వెంకట్రామయ్యకు కలెక్టర్ పూల మొక్కను అందించి సన్మానించారు. కార్యక్రమంలో నీటి పారుదలశాఖ ఎస్ఐ వెంకట్రామయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు శివారెడ్డి, పట్టాభిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశులు, ఎంపీడీవో జాషువా, ఏవో నాగమణి, హౌసింగ్ ఏఈ ఎల్ఎం ప్రసాద్, వీఆర్‌వో ఈశ్వరయ్య, వీఆర్ఏ వెంకట్రమణ, నాగలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీతో అభివృద్ధి శూన్యం : మంత్రి

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు సమయంలో శాస్త్రీయంగా చేసి ఉంటే ఈ రోజు మదనపల్లె జిల్లా ఏర్పాటు అయ్యేది కాదన్నారు. జిల్లా కేంద్రం తరలిపోతోందని విష ప్రచారం చేశారని, జిల్లా కేంద్రం మార్పు లేకపోవడంతో ఇప్పుడు వారికి మింగుడుపడడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలను గందరగోళపరిచే తప్పుడు ప్రచారం చేయడం వైసీపీ నేతలు ఇప్పటికైనా మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు

రామసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బాలిక అదృశ్యం కేసులో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఇది పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే సున్నితమైన కేసని, దర్యాప్తునకు ఆటంకం కలిగించినా, తప్పుడు ప్రచారం చేసినా కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి శనివారం ఎస్ఐ మీడియాకు వివరిస్తూ 17 ఏళ్ల బాలిక తప్పిపోయింది. నవంబరు 17న తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో గాలింపు ప్రారంభించాము. అయితే, సంఘటన జరిగిన వెంటనే అనుమానిత వ్యక్తి తల్లిదండ్రులు, సోదరుడు పరారీ అయ్యారు. వారు నివాసం మార్చడం, సమాచారం దాచడం వంటి చర్యలతో దర్యాప్తునకు తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు. విచారణకు హాజరు కావాలని ఆదేశించినా ఇప్పటివరకు వారు సహకరించలేదని తెలిపారు. బాలిక మిస్సింగ్ కేసును కొందరు పెద్దలు ప్రేమజంట వ్యవహారంగా చూపించడానికి చెప్పడం చట్టపరంగా నైతికంగా తప్పని ఆయన స్పష్టం చేశారు. తప్పుడు కథనాలు, వ్యాఖ్యలు చేసేవారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

క్రీడల్లో సత్తా చాటిన పీలేరు విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

పీలేరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన విభిన్న ప్రతిభావంతుల స్పోర్ట్స్‌లో పీలేరు విద్యార్థులు సత్తాచాటారు. జిల్లా పారా ఒలింపిక్స్ అసోసియేషన్ క్రీడలలో పీలేరు జిల్లా పరిషత్ మెయిన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పోటీలలో ప్రతిభ కనపర్చి బహుమతులు కైవసం చేసుకున్నట్లు హెచ్ఎం డాక్టర్ నీలం జయపాల్‌రెడ్డి తెలిపారు. రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు రన్నింగ్ రేస్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించారని చెప్పారు. ఇందులో తమ పాఠశాల విద్యార్థులు ఆయిషా వంద మీటర్ల రన్నింగ్ రేస్, జ్ఞానశేఖర్ షాట్‌పుట్‌లో, లిఖిత్ లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు డీఈవో చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేసినట్లు ఆయన చెప్పారు. విభిన్న ప్రతిభా వంతుల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు లలితకుమారి, ప్యారూఖాన్, శ్రీరాములు, జయరామ్‌నాయక్, భాస్కర్, హేమలత అభినందించారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు అరవింద్



అరవింద్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

వాల్మీకిపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు వాల్మీకిపురం క్రీడాకారుడు ఎంపికయ్యాడు. స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న టి.అరవింద్ ఈనెల 26వ తేదీ నుంచి విజయవాడలో జరిగిన అంతర్ జిల్లాల అండర్-19 బాస్కెట్ బాల్ పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహించి విశేష ప్రతిభ కనబరచి సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. అతడి ప్రతిభను గుర్తించిన సెలెక్టర్లు జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ కిరణ్‌కుమార్ తెలియజేశారు. త్వరలో రాజస్థాన్‌లో జరగనున్న అండర్-19 జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలలో అరవింద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి క్రీడాకారుడు అరవింద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భాస్కర్‌నాయుడు, బాస్కెట్‌బాల్ కోచ్ అంజి, అధ్యాపకులు, సీనియర్ క్రీడాకారులు అరవింద్‌ను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.


దుగ్గనపల్లెలోని జీవ వనరుల ఉత్పత్తి కేంద్రం

ఉద్యానం... ప్రోత్సాహం

- ప్రకృతి విధానంలో పంటల సాగు ఆరోగ్యకరం
- రైతులకు అండగా ప్రభుత్వం
- ఉద్యాన, వ్యవసాయాధికారుల తోడ్పాటు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలు సాధారణ పంటలతో పోలిస్తే ఎంతో లాభదాయకమైనవి. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి సాగుబడి ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతోంది. మరో వైపు నర్సరీల ఏర్పాటు, సబ్సిడీలు, మైక్రో ఇరిగేషన్ పథకాలు, కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు సహకారం వంటి చర్యలతో ఉద్యానవనశాఖ రైతులకు అండగా నిలుస్తోంది. జిల్లా ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన వన పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

రైతన్నా.. మీకోసం..

రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు జిల్లాలోని రైతుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 24 నుంచి 29 వరకు ప్రతి రైతు ఇంటికి ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు వెళ్లి పంచసూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై వివరిస్తున్నారు. డిసెంబరు 3న రైతు సేవాకేంద్రాల పరిధిలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అన్నిరకాల పంటలకు అనుకూలమైన వాతావరణం కలిగిన వైఎస్ఆర్ కడప జిల్లాలో 45,214 హెక్టార్లలో వివిధ రకాల వ్యవసాయ పంటలు, 58,382 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఇందులో 25,152 హెక్టార్లలో కూరగాయలు, 8717 హెక్టార్లలో మిరప, 2404 హెక్టార్లలో వివిధ రకాల పూలతోటలు సాగులో ఉన్నాయి. 38355 మంది రైతులు 46718 ఎకరాల్లో ప్రకృతి సాగు పద్ధతులను అవలంబిస్తూ ఆరోగ్యకరమైన కాలుష్య రహిత దిగుబడులు పొందుతున్నారు.

ప్రకృతి సాగులో ఉద్యానపంటలకు ఆదరణ

ప్రకృతి సాగులో ఉద్యాన పంటలకు ఆదరణ కనిపిస్తోంది. పూల తోటల్లో చేమంతి, గులాబీ, లిల్లి, కనకాంబరం, బంతిపూలను విస్తృతంగా సాగు చేస్తున్నారు. పండ్లతోటల పరంగా చూస్తే వేలాది ఎకరాల్లో మామిడి, అరటి, చీనీ, బొప్పాయి, సపోటి వంటి పంటలు కూడా విస్తృతంగా సాగు చేస్తున్నారు. అదే విధంగా వేలాది ఎకరాల్లో ఉల్లి, మిర్చి, ధనియాలు, పసుపు తదితర మసాలా పంటలు విస్తృ తంగా సాగులో ఉన్నాయి. బహుళ పంటలు సాగులోకి తెచ్చి తక్కు వ ఖర్చుతో రసాయనాలు లేని సహజ విధానాల్లో సాగు చేయ డం వంటి అంశాలతో రైతుల్లో విస్తృతంగా అవగాహన పెంపొందిం చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీంతో రైతులు వ్యవ సాయంలో వ్యయాన్ని తగ్గిస్తూ తలసరి ఆదాయం అందుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఉద్యానపంటల్లో అంతర పంటలు

ఉద్యానపంటల్లో అంతరపంటలు సాగు చేసే పద్ధతులను అధికారులు రైతులకు వివరిస్తున్నారు. తోటల సాగు అంటే కేవలం మామిడి, జీడీ, కొబ్బరి మాత్రమే కాకుండా జామ, సీతాఫలం, నిమ్మ, నేరేడు, రేగు, మునగ, గులాబీ, మల్లెపూల సాగుతో పాటు ఆయుర్వేద సుగంధ తైల మొక్కల సాగు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఈ పంటలు తక్కువ నీటితో పెరిగే సామర్థ్యం కలిగి బీడు భూములకు ఎంతో అనువుగా ఉంటాయి. పదే పదే నాట్లు వేసుకునే అవసరం లేకుండా సుదీర్ఘకాలం వరకు ఆదాయం వస్తుంది. వార్షిక పంటలు వేశాక ఆదాయం రావడానికి రైతుకు సమయం పడుతుంది. దీని నుంచి బయట పడేందుకు కూరగాయలు, బొప్పాయి, అరటితో పాటు పసుపు, అల్లం వంటి అంతర పంటలను పండిస్తే అదనపు ఆదాయం పొంద అవకాశాలు ఉన్నాయి. ఉద్యానవనశాఖాధికారులు స్టాళ్ల ద్వారా రైతులకు సంబంధిత పంటల సాగు, వాటికి ఉపయోగించే మందులు, సేంద్రియ ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు. ఉద్యానవన పంటల సాగుతో పాటు మార్కెట్ డిమాండ్, రకాలు, పెట్టుబడి, లాభం అంశాలు కూడా చర్చించి పలు సూచనలు సలహాలు ఇస్తున్నారు.


వేముల మండలంలో పంటలు పరిశీలిస్తున్న అధికారులు



ఆరోగ్యకర దిగుబడులు సాధిస్తున్నా..

మాకున్న మూడు ఎకరాలతో పాటు మా అమ్మగారి రెండు ఎకరాలు కలిపి ఐదు ఎకరాల్లో సహజ పద్ధతిలో పలురకాల ఉద్యాన వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నా. వాటికి తోడుగా అంతర పంటలుగా మొత్తం 15 రకాల కూరగాయల సాగు చేస్తున్నా. రసాయనాలు వాడకుండా ఆరోగ్యకర పంట దిగుబడులు అందుకుంటున్నా. ప్రకృతి వ్యవసాయ విభాగంలో ఐసీఆర్‌పీగా పనిచేస్తూ గ్రామంలోని మరికొంత మంది రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నా. ఇటీవల ఇతర దేశాల బృందాలు మా గ్రామనికి వచ్చి మా పంటలు పరిశీలించారు.

-మూలి లక్ష్మీదేవి, మహిళా రైతు, దుగ్గనపల్లె, వేముల మండలం

కష్టపడిన కార్యకర్తలందరికీ న్యాయం చేస్తాం

- టీడీపీ పరిశీలకులు పఠాన్ ఖాదర్‌ఖాన్


సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ ఖాదర్‌ఖాన్

బి.కొత్తకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడిన, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలందరికీ పార్టీ న్యాయం చేస్తుందని బి.కొత్తకోట మండల పార్టీ పరిశీలకులు, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్ అన్నారు. శనివారం పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్లో మండల రూరల్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి, కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలన్నారు. టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్ తాజ్, మండలపార్టీ కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెకు రూ.1000 కోట్లు కేటాయించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్

బి.కొత్తకోట, నవంబరు29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.1000కోట్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కార్యవర్గ సమావే శంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడి వుందని, రైతాంగం, యువత, శ్రామికులను ఆదుకుని వారికి ఉపాధికల్పించాలన్నారు. టమోటా రైతులను ఆదుకునేలా శాశ్వత ప్రణాళికను రూపొందించాలని, హార్సిలీహిల్స్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ప్రభుత్వ డిగ్రీకాలేజీ, ఆర్టీసీ డిపోలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు తోపుక్రిష్ణప్ప, మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, రఘునాథ్, అంజినప్ప, నిజాం, హరి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది...ప్రజలకు ఇక్కట్లు



గుర్రంకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. దీంతో వివిధ పనులపై సచివాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి 10.30 గంటల వ్యవధిలో హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాల్సివుంది. మండలంలోని కొన్ని సచివాలయాల్లో ఉదయం 11 గంటల వరకు కూడా సిబ్బంది రావడంలేదు. దీంతో సర్టిఫికెట్లు, వన్ బీల కోసం సచివాలయాల వద్దకు వచ్చిన ప్రజలు సిబ్బంది తీరుతో ఇబ్బంది పడుతున్నారు. తరిగొండ సచివాలయంలో శనివారం ఉదయం 10.40 నిమిషాలకు కూడా సిబ్బంది రాలేదు. తరువాత సచివాలయానికి మహిళా పోలీసు 10.45 నిమిషాలకు వచ్చారు. సచివాలయానికి వివిధ పనులపై వచ్చిన ప్రజలకు అధికారులు ఎప్పుడు వస్తారో తెలియక పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ఎంపీడీఓ పరమేశ్వ రరెడ్డి వివరణ కోరగా సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించేలా చూస్తామన్నారు. అప్పటికి సిబ్బంది పనితీరు మారకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చోరీ కేసులో ఒడిశా దొంగ అరెస్ట్

- రూ 8.60 లక్షల విలువచేసే బంగారు, వెండి నగలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ లింగప్ప

బద్వేలుటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బంగారు నగల దుకాణంలో ఇటీవల చోరీకి పాల్పడిన ఓ దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 72 గ్రాముల బంగారం, 5 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి శనివారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బద్వేలు పట్టణం సిద్దవటం రోడ్డు మసీదు కాంప్లెక్స్‌లోని జేసీ జ్యువెలర్స్‌లో ఆగస్టు 9వ తేదీ ఒరిస్సాకు చెందిన శ్రీరామ్, అతని స్నేహితుడు వినోద్, బిన్నులు కలసి దొంగతనం చేసినట్లు వివరించారు. ఈ చోరీ కేసును సీఐ లింగప్ప ఆధ్వర్యంలో ఎస్ఐ సత్యనారాయణ, స్పెషల్‌పార్టీ, క్రైంపార్టీ సంయుక్తంగా విచారణ చేపట్టారని తెలిపారు. శనివారం నెల్లూరురోడ్డులోని పాల్‌టెక్నిక్ కళాశాల సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టి, ఆటోలో అనుమానాస్పదంగా వెళుతున్న శ్రీరామ్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. చోరీ కేసును ఛేదించిన సీఐ లింగప్ప, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

డ్రాగా ముగిసిన ఏసీఏ అండర్-14 క్రికెట్‌మ్యాచ్‌లు


వర్మ (రెస్టాఫ్‌సెంట్రల్‌జోన్) - కె.పి. శ్రీరామ్

కడప స్పోర్ట్స్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు శనివారం డ్రాగా ముగిశాయి. ఏసీఏ క్రికెట్ స్టేడియంలో సెంట్రల్‌జోన్ విన్నర్స్-రెస్టాఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్ విన్నర్స్ మొదటి ఇన్నింగ్స్‌లో 79.3 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. రెస్టాఫ్ సెంట్రల్‌జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరుతో రెండవరోజు బ్యాటింగ్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 82 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 352 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. వర్మ 193 పరుగులు చేయడం విశేషం. మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్టాఫ్ సౌత్‌జోన్-నార్త్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.1 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయ్యింది. నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 306 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో కేపీ శ్రీరామ్ 105 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కేఓఆర్ఎం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ విన్నర్స్- రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 48.2 ఓవర్లలో కేవలం 123 పరుగులకే అన్ని వికెట్లు కోల్పోయింది. రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి రోజు 41 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. రెండోరోజు తిరిగి బ్యాటింగ్‌కు దిగి 64.1 ఓవర్లలో 295 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో ఆ జట్టుకు 172 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. బౌలింగ్ విభాగంలో సౌత్‌జోన్ విన్నర్స్ బౌలర్ రక్షణ్‌సాయి ఏకంగా 6 వికెట్లు సాధించారు. ప్రతిగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు 62 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 197 పరుగుల స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపో కుండా 13 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అబ్జర్వర్ మహేంద్ర

మదనపల్లె అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, 2029ఎన్నికల్లో విజయానికి ఇప్పటి నుంచే అడుగులు వేద్దామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్ మహేంద్ర అన్నారు. శనివారం స్థానిక పుంగనూరు రోడ్డులోని సీఎస్ఐ కమ్యూనిటీ హాల్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శి గణేశ్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్కే బాషా, మదనపల్లె నియోజకవర్గం ఇన్ చార్జీ పవన్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నిగార్ సుల్తానీ, రెడ్డి సాహెబ్ యువజన జిల్లా అధ్యక్షుడు కొండుపల్లె ఆనంద్, ఓబీసీ చైర్మన్ ఆవుల ఆది, మీనా కుమారి, మస్తాన్‌రెడ్డి, ముబారక్, ఖాన్, ఖాదర్‌బాషా, మహబూబ్‌పీర్, మహమ్మద్ అలీ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ మహోత్సవం



మదనపల్లె అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం రాత్రి అయ్యప్ప పడిపూజ వైభవంగా ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మార్పూరి సుధాకర్ నాయుడు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కేరళ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రధాన తంత్రి మనోజ్‌స్వామి గణపతి పూజ, పడిపూజ నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు జర్మనీరాజు శివమూర్తి, ఆనందనాయుడు, భగవాన్, వేణుగోపాల్, ముద్దుకృష్ణ, రవి, యోగి, నాగరాజు, తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పట్టణ, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రద్దుచేసిన ఇంటి లబ్ధిదారుల డబ్బు ఏమైనట్లు ?

సమావేశంలో ప్రశ్నించిన కౌన్సిల్ సభ్యులు


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వరప్రసాద్

పులివెందుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీలో జగనన్న మెగా లేఅవుట్‌లో రద్దుచేసిన ఇంటి లబ్ధిదారుల డబ్బు ఏమయ్యాయని పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ సభాభవనంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దాదాపు 7300 మంది పేదలకు ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఇంటి లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారంటూ పలువురిని తొలగించారన్నారు. అయితే అప్పటికే రూ.35వేలు చెల్లించి ఉన్నారని, ఆ డబ్బు ఏమయ్యాయని హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు. దీంతో హౌసింగ్ ఏఈ రామసూరారెడ్డి మాట్లాడుతూ 6800 ఇళ్లరిజిస్ట్రేషన్ అయ్యాయని, దాదాపు 300 ప్లాట్లు పలు కారణాలతో నిలబడిపోయాయని, 242ప్లాట్లు కోర్టులో ఉన్నాయనివివరించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ పలు కారణాలతో నిలబడిన, కోర్టులో ఉన్న ప్లాట్ల లబ్ధిదారులు, అర్హులైన వారు కూడా రూ.35వేలు చెల్లించారని, వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంతలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కలగజేసుకుని లబ్ధిదారులు చెల్లించిన డబ్బులు ఎవరూ వాడుకోలేదన్నారు. రూ.9.58కోట్లు కమీషనర్, హౌసింగ్ ఏఈ జాయింట్ అకౌంట్‌లో ఉన్నాయన్నారు. ఈడబ్బుపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేయకుండా సమావేశం ద్వారా లేక మీడియా ద్వారా ప్రజలకు తెలియజెప్పాలని మున్సిపల్ కమిషనర్ రాముడు, హౌసింగ్ ఏఈలకు సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 18 నెలలైనా పులివెందుల ఇళ్లనుపూర్తి చేయలేదని, ఇక్కడి ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాజకీయంతో ముడిపెట్టకుండా ఇళ్లనుపూర్తి చేసి ప్రజలకు మేలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతర పలువురు కౌన్సిలర్లు లైట్లు, డ్రైనేజీ, వీధి కుక్కలబెడద, ట్రాన్స్‌ఫార్మర్లు, పెండింగ్ రోడ్లు తదితర సమస్యలను ఏకరువుపెట్టారు. చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందుల మున్సిపాలిటీకి ఎంపీల్యాడ్స్ కింద రూ.2.50కోట్లు నిధులు మంజూరైనా ఆ ఫైల్‌నే పక్కనపెట్టేశారన్నారు. నిధులు విడుదల చేస్తే వెంటనే టెండర్లు పిలిచి పులివెందులలోని పెండింగ్ పనులన్నీ పూర్తిచేసే అవకాశం ఉంటుందని, ఆ దిశగా కూటమి నేతలు కృషిచేయాలని సూచించారు. పులివెందుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. వైస్ చైర్మన్‌లు వైఎస్ మనోహర్‌రెడ్డి, హఫీజుల్లా, రెవెన్యూ, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను వివిధ రకాల పూల మాలలతో అలంకరించి అర్చకులు పూజలను నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు చైన్ లాక్కెళ్లిన దొంగలు



పీలేరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డికాలనీలో శనివారం రాత్రి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు మహిళ మెడలోని 35 గ్రా ముల బంగారు గొలుసు లాక్కెళ్లారు. స్థానికుల కథనం మేరకు.... వగళ్ల పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌నాయుడు నాగిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి హరిప్రసాద్ బయట ఉండగా ఇంటి వద్దకు వచ్చిన నలుగురు దొంగలు నీ భర్తను జాగ్రత్తగా ఉండమను, మా జోలికి రావద్దు అంటూ బెదిరిస్తూ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఇంటి పక్కనే ఉన్న ఆమె భర్త అప్రమత్తమై ఒకరిని పట్టుకుని అతడికి దేహశుద్ధి చేశారు. పట్టుబడ్డ దొంగది పీలేరు మండలం ఎర్రగుంట్లపల్లె పంచాయతీ పరిధిలోని బెస్తపల్లెగా అనుమానిస్తున్నారు. దొంగ పారిపోవడానికి ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. దొంగను పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'దిత్వా'ను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



గర్భిణులకు సూచనలిస్తున్న తలపుల పీహెచ్‌సీ సిబ్బంది

పీలేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వచ్చే రెండు రోజుల్లో తీరం దాటనున్న దిత్వా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కోవాలని పీలేరు తహసీల్దారు శివకుమార్ మండల అధికారులకు సూచించారు. తుఫాను కారణంగా భారీ వర్షాలు ఉండవచ్చన్న హెచ్చరికలతో శనివారం ఆయన తన కార్యాలయంలో మండల అధికారులతో సమీక్షించారు. కొంత కాలంగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని నీటి వనరులన్నీ నిండు కుండలను తలపిస్తున్నాయని, రానున్న రెండు రోజుల్లో కురిసే వర్షాల కారణంగా వాటికి ఏవిధమైన ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. నదులు, వాగులు, వంకలు, చెరువుల వద్దకు వెళ్లవద్దని ఆయన హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాలను అనుక్షణం గమనిస్తుండాలని వీఆర్వోలకు సూచించారు. తుపాను సహాయక చర్యల కోసం తహసీల్దారు కార్యాలయంలో 6302066403 నెంబరుతో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, ఎప్పుడు, ఏ అవసరం వచ్చిన ఆ నెంబరుకు ఫోన్ చేయాలని ప్రజలకు తెలియజేశారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తలపుల పీహెచ్‌సీ సిబ్బంది శనివారం స్థానిక ఆర్బీసీ నల్లగుట్టలో అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారు ల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్ వివరించారు. వేర్వేరు కార్యక్రమాల్లో ఏఎస్ఓ రెడ్డప్ప నాయుడు, ఆర్ఐ మురుగయ్య, డిప్యూటీ ఎంపీడీఓ యుగంధర్, డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య పాల్గొన్నారు.

ఒత్తిడిని తగ్గించేందుకే క్రీడలు

ఉపాధ్యాయులకు ఆటలు పోటీలు ● డివిజన్ జట్టు విజేతలకు అభినందనలు





నిమ్మనపల్లిలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓలు పద్మావతి, నారాయణ - డివిజన్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈఓ ద్వారకనాథ్

నిమ్మనపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు పద్మావతి, నారాయణ తెలిపారు. శనివారం స్థానిక తెలుగు (మీడియం) జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు క్రికెట్, వాలీ బాల్ క్రీడలు జరిగాయి. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు శారీరక, మానసిక ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. అయితే మండలంలోని అన్ని పాఠశాలల్లోని ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కాగా శనివారం జరిగిన క్రికెట్ గేమ్స్‌లో నిమ్మనపల్లి జడ్పీహైస్కూల్ గెలుపొందినట్లు తెలిపారు. విజేత టీమ్ డివిజన్ స్థాయిలో పాల్గొటుందని తెలిపారు.

మోడల్ స్కూల్‌లో క్రీడాపోటీలు

కురబలకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు క్రాస్ సమీపంలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు క్రీడాపోటీలను శనివారం నిర్వహించారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఎంఈఓ ద్వారకనాథ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ యోజనా గాంధీ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి క్రీడాకారులను డివిజన్ పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరులో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన వారిని ఎంఈఓ, పీడీ రమేష్ తదితరులు అభినందించారు.

సంబరంగా ఉపాధ్యాయ క్రీడలు

బి.కొత్తకోట, నవంబరు29(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలస్థాయి ఉపాధ్యాయ క్రీడలు శనివారం సంబరంగా నిర్వహించారు. స్థానిక జడ్పీహైస్కూల్ ఆవరణలో జరిగిన ఈ క్రీడలను ఎంఈఓ రెడ్డిశేఖర్ ప్రారంభించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా క్రీడలు నిర్వహిస్తోందన్నారు. క్రీడా పోటీల్లో బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి, గురుకులం ప్రిన్సిపాల్ ప్రసాద్, పలువురు ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటలు పోటీలు

రామసముద్రం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్ మైదానంలో శనివారం మండల ఉపాధ్యాయులకు ఆటల పోటీలు జరిగాయి. మండల స్థాయిలో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 50మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ మండల స్థాయి పోటీల్లో విజేతలకు డిసెంబరు 12న డివిజన్ స్థాయిలో ఆ తర్వాత గెలిచిన వారు జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో ఆడాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రామసముద్రం, చెంబకూరు, చొక్కాండ్లపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, రమేష్‌బాబు, శ్రీనివాసులు, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఉన్నత పాఠశాల పీడీలు పార్థసారథి, మోహన్, పవన్, రమాదేవి, ఇందిరా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నాగరాజ, ఎస్టీయూ నేతలు నరసింహులు, ప్రకాష్‌రెడ్డి, అనిల్‌కుమార్, సుధాకర్, కేశవకుమార్, కుసుమ, లక్ష్మీకాంతి, రెడ్డెమ్మ, భార్గవి, శ్వేత, మంజుల పాల్గొన్నారు.

ఎస్టీయూ అధ్యక్షుడిగా చంద్రశేఖర్



బి.చంద్రశేఖర్



రెడ్డప్ప



రేఖ



కళావతి

పీలేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ పీలేరు మండల శాఖ నూతన అధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్ శనివారం ఎన్నికయ్యారు. పీలేరులో శనివారం ఎస్టీయూ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో చంద్రశేఖర్ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా రెడ్డప్ప, ఆర్థిక కార్యదర్శిగా రేఖ, మహిళా కన్వీనర్‌గా కళావతి, ఆర్థిక కార్యదర్శిగా వేణుగోపాల్ ఎన్నికయ్యారు. అనంతర సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అంకెం శివారెడ్డి మాట్లాడుతూ ఇన్ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించి పీఆర్‌సీని వేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు కడియాల మురళి, మహేశ్వర రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, భాస్కరరెడ్డి, లోకనాథరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దళితవాడల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలి

● సమావేశంలో దళిత నేతల డిమాండ్



గుడ్లవారిపల్లిలో ఎస్సీ ఎస్టీ సమావేశంలో మాట్లాడుతున్న దళిత నేతలు

నిమ్మనపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దళితవాడల్లో దళితులు చనిపోతే వారిని పాతి పెట్టేందుకు కాడా స్థలం కరవైందని దళిత నేత మునిరత్నం, వీరనాల మాన్యాణిక్యం అన్నారు. శనివారం రాచవేటివారిపల్లి పంచాయతీ గుడ్లవారిపల్లిలో తహసీల్దార్ తపస్విని ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ మానటరింగ్ సమావేశం జరిగింది. దళిత నేతలు మాట్లాడుతూ 15ఏళ్లుగా ఎస్సీ ఎస్టీ మానటరింగ్ సమావేశాలు జరుగుతున్నాదళిత గ్రామాల్లో ఒక్క సమస్య తీరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలప్పుడు మాత్రం హామీలు ఇస్తారని, తరవాత వాటిని పట్టించుకోవడం లేదని వాపోయారు. మండల అధికారులు సమావేశాలకు హాజరు కాక పోతే తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలన్నారు. మండలంలోని హీనజాతి భూములు వేల ఎకరాలున్నాయని వాటిలో గతంలో పట్టాలు ఇచ్చి వాటిని ఆన్‌లైన్ చేయలేదన్నారు. కొందరు రైతుల నుంచి భూస్వాములు దళితలను మబ్బెపెట్టి వారి భూములను లాక్కున్నారని తెలిపారు. గ్రామాల్లో మురుగునీటి కాల్వలు విద్యుత్ దీపాలు, వంటి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. శ్మశాన వాటికలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నాని తెలిపారు. అనంతనం తహసీల్దార్ తపస్విని మాట్లాడుతూ ప్రతి నెల ఒక గ్రామంలో సివిల్ రైట్స్ సమావేశం నిర్వహించి దళిత వాడల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతున్నామని సమస్యలను వీలైనంత వరకు పరిష్కరిచేలా ప్రయత్నిస్తామన్నారు. ఎంపీడీఓ పక్రుద్దీన్, డిపూటీ ఎంపీడీఓ బాలరాజు, ఆర్ఐ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, ఏపీఎం మురళి, ఎంఈఓ-2 నారాయణ, సర్వేయర్ గోపి, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

తంబళ్లపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం అలవర్చుకోవాలని ఎంపీడీఓ బాషూజీ పట్నాయక్ అన్నారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణం, జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు తొలగించి శ్రమదానం చేశారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల వలన పిల్లల్లో సేవాభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రెండు నాల్కల ధోరణి వీడాలి



కురవంకలో మాట్లాడుతున్న పంచాయతీ వార్డు సభ్యులు, ప్రజలు

మదనపల్లె టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కురవంక ఉపసర్పంచ్ బైగారి భారతి రెండు నాల్కల ధోరణి వీడాలని వార్డు సభ్యులు నాగరాజు, గొంగడి కృష్ణమూర్తి అనిత హితవు పలికారు. శనివారం కురవంక గ్రామంలో వార్డు సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెలా సచివాలయంలో నిర్వహించే వార్డు సభ్యుల సమావేశాలకు నిరవధికంగా గైర్హాజరైన ఉపసర్పంచ్ భారతి, పంచాయతీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పట్టించుకోలేదన్నారు. దీనిపై తాము అవిశ్వాస తీర్మానం పెట్టి, సబ్‌కలెక్టర్ సమక్షంలో భారతికి వ్యతిరేకంగా ఓట్లు వేశామన్నారు. ఈ విషయం తెలుసుకుని హడావుడిగా వెళ్లి రాజీనామా పత్రం సమర్పించిన భారతి, తాను వారం రోజుల ముందే రాజీనామా చేశామని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా వుందన్నారు. కురవంక అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ చలపతిపై ఆరోపణలు చేస్తూ భారతి నైతిక విలువలు కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాసులు, చంద్రిక, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కంచర్ల చింటూ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కట్టా దొరస్వామినాయుడు, కంచర్ల శ్రీనివాసులునాయుడు

మదనపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నారా లోకేష్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల చింటూ జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ నేతలు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామినాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ గంగారపు నవీన్‌కుమార్, మాజీ కౌన్సిలర్ జి.సహజీవన్‌బాబు, ఎంపీఎల్ రెడ్డెప్ప, కంచర్ల మల్లికార్జున నాయుడు, పెరవలి ఆదినారాయణ, హరికృష్ణ, యలంకి సతీష్, హరికృష్ణ నాయుడు, మహేష్, చిన్నరెడ్డి, నవీన్‌కుమార్, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్‌జీఓ ఎన్నికలు



కొత్తగా ఎన్నికైన ఏపీఎన్‌జీఓ పీలేరు యూనిట్ కార్యవర్గ సభ్యులు

పీలేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీఓ పీలేరు యూనిట్ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో పీలేరు ఏఎస్ఓ రెడ్డప్ప నాయుడు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ మరో 12 మంది కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, కన్వీనర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా ధనలక్ష్మి



మదనపల్లె టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ ఏకలవ్య గిరిజన పరిర క్షణ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా మదనపల్లె వాసి ఆవుల ధనలక్ష్మిని నియమిస్తూ వర్కింగ్ ప్రెసిడెంట్ జయప్ప నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీజీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఆనంద కుమార్ మాట్లాడుతూ ఏపీజీపీఎస్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆవుల మల్లికార్జున గిరిజనుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆయన స్థానంలో ధనలక్ష్మిని నియమించామన్నారు. ధనలక్ష్మి కూడా గిరిజనుల సంక్షేమం, సమస్యల గురించి రాష్ట్రమంతటా పర్యటిస్తూ వారి బాగోగులు చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మికి పలువురు గిరిజన సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.

3న టౌన్‌బ్యాంకు శతజయంత్యుత్సవాలు

బ్యాంకు ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్‌బ్యాంకు ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్

మదనపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబరు 3వతేదీన శతజయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంకు ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ ప్రకటించారు. స్థానిక బుగ్గకాల్వలోని ఎన్వీఆర్ కల్యాణమండపంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఛైర్మన్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు మంత్రులు కె.అచ్చన్నాయుడు, మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎం.షాజహాన్‌బాష, ఎన్.కిశోర్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు భాస్కర్‌కుమార్, డైరెక్టర్లు జోళపాలెం మహేంద్ర, సోము, ఆకుల కృష్ణమూర్తి, పసుపు రవీంద్ర, సత్తార్, నిరంజన్‌కుమార్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి ఉమర్‌ఫరూక్

తంబళ్లపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలు, న్యాయాలపై అవగాహన పెంచుకోవాలని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ అన్నారు. శనివారం ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల కార్మికుల నిర్మూలన, బాలల రక్షణ, హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయాధికారి మాట్లాడుతూ చట్టాలు ప్రజల రక్షణ కోసమే ఉన్నాయన్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడంతోనే కొందరు క్షణికావేశంలో నేరాలు, గొడవలు, తప్పులు చేసి జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. క్రమశిక్షణతో కూడిన చదువు ఉన్నత స్థాయికి ఎదగడానికి సోపానమన్నారు. మనిషి సాధించాలనుకుంటే ప్రయత్నం చేస్తే కానిది ఏదీ లేదని, జీవితంలో చదువు ముఖ్యమని, చదువుతోనే జీవితాల్లో మార్పు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

యాప్ లోనే పన్ను చెల్లింపులు

పెద్దతిప్పసముద్రం నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను, పన్నేతర వసూళ్లను స్వర్ణపంచాయతీ ద్వారానే డిజిటల్ చెల్లింపులు జరిగేలా కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించి చెల్లింపులు జరపాలన్నారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతి పంచాయతీలో స్వర్ణపంచాయతీ యాప్ ద్వారానే ఇంటిపన్ను చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు పంచాయతీ కార్యదర్శులు స్వర్ణపంచాయతీ ద్వారా చెల్లింపులు జరపడం లేదన్నారు. ప్రతి కార్యదర్శి తప్పక స్వర్ణపంచాయతీ ద్వారానే చెల్లింపులు జరపాలన్నారు. కార్యదర్శి ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలన్నారు.

పీహెచ్‌ఎన్‌గా కుసుమ కుమారి



పీలేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తలపుల పీహెచ్‌సీ ప్రజారోగ్య నర్సింగ్ అధికారి (పీహెచ్‌ఎన్)గా అదే పీహెచ్‌సీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కుసుమ కుమారి నియమితులయ్యారు. కడపలో శనివారం జరిగిన పదోన్నతుల కౌన్సెలింగ్‌లో కుసుమ కుమారి పదోన్నతి పొందడమే కాకుండా తలపుల పీహెచ్‌సీలోనే నియామకం పొందారు. పీహెచ్‌ఎన్‌గా నియమి తులైన కుసుమ కుమారిని పీహెచ్‌సీ వైద్యాధికా రులు గిరీషా, చంద్రశేఖర్ నాయక్, సిబ్బంది తదితరులు అభినందించారు.

ప్రజలు ఐక్యతతో మెలగాలి

కలకడ. నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజలు ఐక్యతతో మెలగాలని తహసీల్దార్ మహేశ్వరీ బాయి అన్నారు. శనివారం కోన పంచాయతీలో తహసీల్దార్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. గ్రామస్థుల సమస్యల పరిష్కారంపై స్పందించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత బరకం శ్రీనివాసులురెడ్డి, విఆర్ఓ రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న సింగిల్ విండో అధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజు

ములకలచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సింగిల్ విండో అధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజు అన్నారు. సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు సహకార రుణాలు, ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న సబ్సిడీలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో డీసీసీబీ మదనపల్లె బ్రాంచ్ మేనేజర్ స్వర్ణలత, సూపర్‌వైజర్ వెంకటరమణ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, సింగిల్ విండో కార్యదర్శి బావాజీ, నేతలు గంగాదేవి, రమణారెడ్డి, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రకటనపై సంబరాలు



అంగళ్లులో సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు

కురబలకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రకటనపై మండలంలోని అంగళ్లులో కూటమి నేతలు శనివారం పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అంగళ్ళు మూడు రోడ్ల కూడలిలో కూటమి నేతల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మదనపల్లె ఏఎంసీ ఛైర్మన్ జె.శివరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మదనపల్లెకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మదనపల్లెను జిల్లా చేసి హామీని నిలబెట్టుకున్నారన్నారు. అనంతరం పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్‌కు పాలాభిషేకం చేసి కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. ఏఎంసీ డైరెక్టర్లు లక్ష్మీపతి, రేణురుబాబు, మాజీ సర్పంచ్ రమణ, మాజీ ఎంపీపీలు కుళ్లాయప్ప, తిమ్మరాయుడు, రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్ బాష కూటమి నేతలు సీతారాం, మోహన్‌రెడ్డి, రవీంద్రయాదవ్, రాజారెడ్డి, మనోజ్, అంజి, రామకృష్ణ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరానికి విశేష స్పందన



పెద్దమండ్యం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చెరువుకిందపల్లిలో శనివారం జరిగిన పశు వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత పశువైద్య శిబిరాన్ని తంబళ్లపల్లి శాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర ప్రారంభించారు. ఏడీ మాట్లాడుతూ పల్లెల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో అనారోగ్య పశువులకు వైద్యం అందించడం బాధ్యతన్నారు. ఈ వైద్య శిబిరంలో 42 పాడి ఆవులకు గర్భకోశ వ్యాధులకు, 91 పశువులకు బూటాక్స్ పిచికారీ, 52 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశు వైద్యాధికారులు ఉస్మాన్, చరిత, విక్రమ్‌రెడ్డి, సహాయకులు పాల్గొన్నారు.